# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం, జూన్ 9, 2025 | సంపుటి - 20 | సంచిక 150 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


# కరోనా కలకలం..

## ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు




న్యూఢిల్లీ: ప్రపంచదేశాలను గడగడలాడించిన కరోనా మరోసారి భారత్‌లో విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో యాక్టివ్ కేసుల సంఖ్య 6 వేలు దాటింది. ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 6,133గా ఉన్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం కేరళలో 1950, గుజరాత్‌లో 822, బెంగాల్‌లో 693, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఏపిలో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

మిగతా 2లో



# చేప మందు పంపిణీ షురూ..

## భారీగా తరలివచ్చిన ఆస్తమా రోగులు

హైదరాబాద్: ఆస్తమాతో బాధపడుతున్న రోగులకు బత్తిని సోదరులు ప్రతి ఏటా ఉచితంగా సరఫరా చేసే చేప ప్రసాదం పంపిణీ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ప్రతి ఏడాది మృగశిర కార్తె సందర్భంగా బత్తిని కుటుంబ సభ్యులు చేప మందును పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. చేప ప్రసాదం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా ఆస్తమా బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

2లో

# మాగంటి గోపీనాథ్ పార్థివదేహానికి కేసీఆర్ నివాళులు..

## ఉద్వేగానికి లోనైన బీఆర్ఎస్ అధినేత

హైదరాబాద్ : సీనియర్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. మాగంటి గోపీనాథ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం గోపీనాథ్ భార్య, పిల్లలను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్‌ను దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కష్టకాలంలో వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ పార్థివదేహాన్ని చూసి కేసీఆర్ ఉద్వేగానికి గురయ్యారు. మాగంటి కుమారుడిని పట్టుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.

2లో



# ప్రభుత్వ లాంఛనాలతో మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు..




జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు ముగిశాయి. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలను మధ్యాహ్నం ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య నిర్వహించారు. గోపీనాథ్ అంతిమ సంస్కారాలకు బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. మాగంటి గోపీనాథ్ భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

మిగతా 2లో

# దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం

## ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి :

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను దత్తన్న అని అభిమానంగా పిలుచుకుంటారని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. జెంటిల్ మెన్ కు ప్రతిరూపం బండారు దత్తాత్రేయ అని సిఎం కొనియాడారు. హైదరాబాద్ లో 'ప్రజల కథే నా ఆత్మకథ' బండారు దత్తాత్రేయ ఆటోబయోగ్రఫీ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ నేతగా ఎదిగారని, ఎన్నో పోరాటాలు చేశారని, ఉద్యమాలు, సంఘర్షణలు ఎదుర్కొన్నారని అన్నారు. దత్తాత్రేయ కోరుకుంది జనహితం.. ఆయనది లౌకికవాదం అని చెప్పారు. బండారు దత్తాత్రేయ పాటించేది మత సామరస్యం అని అలయ్ బలయ్ పేరుతో అన్నివర్గాలను ఏకతాటిపైకి తెచ్చారని ప్రసంసించారు.

మిగతా 2లో

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## అమెరికా నుంచి హైదరాబాద్‌కు ప్రభాకర్ రావు



హైదరాబాద్ :

తెలంగాణ సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసులో ప్రదాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. ఎట్టకేలకు అమెరికా నుంచి హైదారాబాద్ కు వస్తున్నాడు. రెండు రోజుల క్రితమే ప్రభాకర్ రావుకు ఇండియన్ ఎంబసీ ట్రావెల్ పర్మిట్ ఇచ్చింది. మరికొన్ని గంటల్లో ప్రభాకర్ రావు హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు తెలుస్తోంది. సోమవారం సిట్ ఎదుట విచారణకు ప్రభాకర్ రావు హాజరుకానున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి కావడంతో ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయాడు. అప్పటినుంచి తిరిగి ఇండియాకు రప్పించేందుకు హైదరాబాద్ పోలీసులు తీవ్రంగా శ్రమించారు. కేంద్రం సహకారంతో ప్రభాకర్ రావుకు రెడ్ కార్నర్ నోటీసులు కూడా ఇచ్చారు. ఎట్టకేలకు ప్రభాకర్ రావు హైదరాబాద్ కు వస్తుండటంతో ఈ కేసులో ఎలా టర్న్ అవుతుదోనని ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ కేబినెట్‌లోకి ముగ్గురు మంత్రులు

## జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరిలకు చోటు

## రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం పూర్తి

**తెలంగాణ రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై 17 నెలలుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కొత్తగా ముగ్గురు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఆదివారం నాడు జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం చేయించారు. ప్రస్తుత మంత్రివర్గంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు 12 మంది మంత్రులుగా కొనసాగుతున్నారు. మరో ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఇవాళ ముగ్గురిని భర్తీ చేశారు. మార్పు చేర్పులతో ఐదు బెర్తులు పూరించాలని తొలుత భావించినా, సామాజిక వర్గ సమీకరణాల నేపథ్యంలో ఇప్పుడు ముగ్గురి పేర్లకు ఆమోదం లభించినట్టు తెలిసింది.**



హైదరాబాద్ :

మంత్రివర్గ విస్తరణలో మొదట్నుంచి జి.వివేక్ వెంకటస్వామి పేరు వినిపిస్తూనే ఉంది. అయితే శనివారం ఉదయం అనూహ్యంగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. వివేక్ కుటుంబం నుంచి ఇప్పటికే ముగ్గురికి పదవులు ఇవ్వడంతో మళ్లీ వారికే ఇస్తే ప్రజల్లోకి ప్రతికూల సంకేతాలు వెళ్తాయని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీంతో గడ్డం ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. తనకు అవకాశం ఇవ్వకుంటే ప్రత్నామ్నాయం చూసుకోవాల్సి వస్తుందని వివేక్ హెచ్చరించినట్టు తెలిసింది. మీడియాతోపాటు ఆర్థికంగా బలంగా ఉన్న ఆయన కుటుంబాన్ని వదులుకోవడం ఇష్టంలేని అధిష్ఠానం మధ్యేమార్గంగా వివేక్‌కు స్పీకర్ పదవి ఆఫర్ చేసినట్టు సమాచారం. అయితే, తనకు మంత్రి పదవి తప్ప మరేమీ వద్దని ఆయన కరాఖండిగా చెప్పినట్టు తెలిసింది. దీంతో ఆయనే మంత్రి పదవిని ఖరారు చేశారు.

### బీసీ కోటాలో వాకిటి.. మాదిగ సామాజికవర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్

బీసీ సామాజిక వర్గం నుంచి ఒకరికి అవకాశం ఉన్న నేపథ్యంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దాదాపు ఖరారైనట్టు తెలిసింది. అసలైన మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

మిగతా 2లో



2

# నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు మాజీ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్ : మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సోమవారం నాడు కాళేశ్వరం కమిషన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు హాజరై వాగ్మూలం ఇవ్వనున్నారు.

# ఇంతమంది గవర్నర్లను ఒకే వేదికపై చూడటం అరుదు

## సిఎం రేవంత్ రెడ్డి



2

హైదరాబాద్ : తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ స్కూల్‌లో చదివానని.. కాలేజీ ఎపి సిఎం చంద్రబాబు నాయుడు దగ్గర చేశానని తెలిపారు. ఉద్యోగం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దగ్గర చేస్తున్నానని అన్నారు.




# తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌డిఏ ప్రభుత్వాలు వస్తాయి

న్యూఢిల్లీ :

తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో జరిగే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లో ఎన్‌డిఏ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం అన్నారు. ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మదురై 'పరివర్తన' నగరంగా కీర్తించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, ఎఐఎడిఎంకె కలసి ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. తమిళనాడులోనే కాదు పశ్చిమ బెంగాల్‌లో కూడా ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. ఏప్రిల్‌లో తాను తమిళనాడు సందర్శిస్తానని, ఎఐఎడిఎంకెతో సంబంధాలు పునరుద్ధరిస్తానని అన్నారు. ఇదిలావుండగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నాయినార్ నాగేంద్రన్ డిఎంకె ప్రభుత్వాన్ని తన ప్రసంగంలో విమర్శించారు. వయో వృద్ధులపై లక్షిత దాడులు చేయడాన్ని ఆయన ప్రశ్నించారు. తమిళ నాడులో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందన్నారు. తాను వీలయినంత గరిష్ఠంగా అసెంబ్లీకి ఎంఎల్‌ఏలను తీసుకెళ్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. పార్టీ కార్యకర్తలు సంకల్పంతో పనిచేయాలని, డిఎంకెను అధికారం నుంచి దించేసే లక్ష్యంతో పనిచేయాలని బిజెపి నాయకుడు కె. అన్నామలై అన్నారు.

# కరోనా కలకలం..

దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కారణంగా ఆరుగురు మృత్యువాతపడ్డారు. కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి చెందారు. దీంతో ప్రజల్లో మరోసారి భయాందోళనలు మొదలయ్యాయి. కేరళలో గత 24 గంటల్లో 192 కేసులు నమోదు కాగా.. గుజరాత్‌లో 107, బెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగుచూశాయి. అత్యధిక పాజిటివ్ కేసుల్లో కూడా కేరళ ముందు స్థానంలో ఉంది. ఆ తర్వాత ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ ఉన్నాయి. అయితే ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రామ్ సబ్‌వేరియంట్లు, లీనియేజ్‌లు అప్పర్ రెస్పిరేటరీ పైనే ప్రభావం చూపుతుంన్నందున ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు.

## నేడు కాళేశ్వరం కమిషన్ ముందుకు మాజీ మంత్రి హరీష్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిల నిర్మాణాలపై కమిషన్ గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, హరీష్ రావులతో పాటు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈనెల 5వ తేదీన మాజీ సిఎం కెసిఆర్ హాజరుకావాల్సి ఉండగా, వాయిదాను కోరుతూ తాను ఈనెల 11వ తేదీన కమిషన్ ముందు హాజరవుతారని కమిషన్‌కు తెలియజేశారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి, ప్రస్తుత బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ ఈనెల 6వ తేదీన కమిషన్ ముందు హాజరయ్యారు. జస్టిస్ పి.సి ఘోష్ అడిగిన ప్రశ్నలకు ఈటల రాజేందర్ సమాధానాలు ఇచ్చారు. దాదాపు ఇరవై నిమిషాల పాటు ఈటల రాజేందర్‌ను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఆతర్వాత తాను క్రాస్ ఎగ్జామినల్‌లో ఇచ్చిన వాగ్మూలాన్ని ధృవీకరిస్తూ నోట్స్‌పై సంతకాలు చేసి వెళ్ళిపోయారు. ఈనెల 11వ తేదీ బుధవారం నాడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జస్టిస్ పిసి ఘోష్ విచారణకు హాజరుకానున్నారు.

## చేప మందు పంపిణీ షురూ..

వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.చేప ప్రసాదం కోసం వచ్చిన ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి 42 క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. 13 కౌంటర్ల ద్వారా ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. పోలీసులు భారీ బందోస్తు ఏర్పాటు చేశారు. కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఆది సోమవారాల్లో జరుగనున్న ఈ కార్యక్రమం కోసం.. ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నది. నగరం నలుమూలల నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు 140 స్పెషల్ బస్సులను తిప్పుతున్నట్లు అధికారులు వెల్లడించారు. కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జేబీఎస్, ఎంజీబీఎస్ నుంచి బస్సులను సిద్ధంగా ఉంచింది. ప్రయాణికుల కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ రిసెప్షన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తుండగా, జల మండలి మంచినీటి సరఫరా చేస్తున్నది. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన చేప ప్రసాదం పంపిణీ, సోమవారం ఉదయం 9 గంటల వరకు కొనసాగనుంది. దీనికోసం మత్స్య శాఖ లక్ష చేప పిల్లలను సిద్ధంగా ఉంచింది.

## పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు‘

పట్టుగొమ్మలు‘పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు’ అని మహాత్మాగాంధీ అన్నారు. పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మద్యానికి దూరంగా ఉండటం, మౌలిక వసతులు కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి సాధిస్తాయి. ఈ గ్రామానికి మూడు వైపుల నుంచి రెండు లైన్ల రోడ్లు, రోడ్లకిరువైపులా చెట్లతో గ్రామంలోకి స్వాగతం పలుకుతున్నట్టుగా ఉంటుంది. గత ఎనిమిదేండ్లుగా నా పరిశోధనలో ఈ గ్రామం అన్నిరంగాల్లో స్వయం సమృద్ధి సాధించి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఈ గ్రామం మత సామరస్యానికి పుట్టినిల్లు. ఈ గ్రామ జనాభా సుమారు 5,000, ఓటర్ల సంఖ్య సరిగ్గా 2400. సామాజిక వర్గాల వారీగా కుటుంబాలు ఎస్టీ: 5, ఎస్సీ: 230, బీసీ: 630, ఓసీ: 65, ముస్లిం మైనారిటీ: 40. ఈ గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి విస్తీర్ణం 4,192 ఎకరాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 3,300 ఎకరాల భూమి ఉన్నది. ఒక కుమ్మరి సామాజిక వర్గం తప్ప అన్ని కులాల వారు, అన్ని మతాల వారున్నారు. ఇదీ స్థూలంగా ఆ గ్రామ స్వరూపం. ఆ ఊరి పేరు తునికి ఖల్సా, మండలం వర్గల్, జిల్లా సిద్దిపేట. 1950, మే 21 వరకు ఈ గ్రామాన్ని తునికి అనే పేరుతో పిలిచేవారు. ఈ ప్రాంతంలో తునికి ఆకు (బీడీలు చేసే ఆకు) ఎక్కువగా లభించడంతో తునికి అనే పేరు వచ్చినట్టు చెప్తారు. ఖల్సా అనగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా కలిగి ఉన్న భూములని అర్థం. ఈ గ్రామంలో ఇప్పటికి దాదాపు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. (ఖల్సా అంటే స్వచ్ఛమైనది.) 1950, మే 22 నుంచి ఈ గ్రామాన్ని తునికి ఖల్సాగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ గ్రామం చుట్టుపక్కల తునికి పేరుతో తునికి మక్త, తునికి బొల్లారం గ్రామాలున్నాయి. ఈ గ్రామం నెహ్రూ ఓఆర్‌ఆర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో, రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇక్కడ అన్నిరకాల రాజకీయ పార్టీలున్నాయి. ఇక్కడి వ్యవసాయ భూములు స్థానికులకు 1,113 ఎకరాలు, స్థానికేతరులకు 1,203 ఎకరాలున్నాయి. భూమి ఉన్న కుటుంబాల సంఖ్య 534, భూమి లేని కుటుంబాల సంఖ్య 396. సామాజిక వర్గాల వారీగా భూమి ఉన్న కుటుంబాల వివరాలు: ఎస్టీ: 0, ఎస్సీ: 135, బీసీ: 363, ఓసీ: 36, మైనారిటీ: 25.ల ఇక్కడి ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడికి వంటిమామిడి కూరగాయల మార్కెట్ దగ్గరగా ఉండటంతో ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తారు. కూరగాయలు, ఆకుకూరలు, వరి, ఆలుగడ్డ ఇక్కడి ప్రధాన పంటలు. ప్రధాన సాగునీటి వసతి బోర్లు, చెరువు కుంటలు. కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ఇక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. కూరగాయలు పండించడంతో ఇక్కడ రైతు, రైతు కూలీలకు నిత్యం పని దొరుకుతున్నది. రైతులకు, రైతు కూలీలకు చేతిలో ఎప్పుడూ డబ్బులుంటాయి. సుమారు 32 జతల ఎడ్లు, 46 ట్రాక్టర్లు, 19 ట్రాలీ ఆటోలు, 5 ప్యాసింజర్ ఆటోలు, 21 కార్లు, దాదాపు ప్రతి ఇంటికి ఒక సైకిల్ మోటార్ ఉన్నాయి. చాలామందికి పాలిచ్చే బర్రెలున్నాయి. 80 శాతం మంది అక్షరాస్యులే. ఇంత పెద్ద గ్రామంలో ఒక హోటల్, ఒక స్వీట్‌షాప్, ఐదు బెల్ట్ షాపులు మాత్రమే ఉన్నాయి. యువత కూడా వ్యవసాయం పనులు, రకరకాల కంపెనీలలో ఎవరి పనులకు వారు వెళ్లిపోవడం మూలంగా ఇక్కడ ఆరోగ్యకరమైన వాతావరణం ఉన్నది. ఇక్కడి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటున్నది. తక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రెండు కుటుంబాలు మినహా దాదాపు అన్ని కుటుంబాలు వారి స్తోమతకు తగ్గట్టుగా అవసరాలు తీర్చుకునే స్థితిలో ఉన్నారు. ఇక్కడ పంచాయితీలు చాలా తక్కువ. చిన్న, చిన్న పంచాయితీలను కూడా గ్రామ పరిధిలో పరిష్కరించుకుంటారు. పోలీస్ స్టేషన్ వరకు ఈ గ్రామస్థులు పోరు అంటే అతిశయోక్తి కాదు. రాజకీయాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల వరకే, ఎన్నికల తెల్లారి చాలా ఆత్మీయంగా కలిసి ఉంటారు.ఈ గ్రామం వర్గల్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ గ్రామ పంచాయతీలో 12 వార్డులున్నాయి. గ్రామ పంచాయతీలో 9 మంది సిబ్బంది పనిచేస్తారు. ఒక ట్రాక్టర్ ఉన్నది. గ్రామం ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంటుంది. ఐదు వాటర్ ట్యాంకులు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ, వంటగ్యాస్ కనెక్షన్ ఉన్నది. వ్యక్తిగత మరుగుదొడ్లున్నాయి. ఇక్కడ ఎక్కువగా ఆర్‌సీసీ ఇండ్లున్నాయి. ఈ ఊరు మాంసం విక్రయాలకు పేరుగాంచింది. గ్రామంలోని ప్రతి వీధికి సూచిక బోర్డులను ఏర్పాటుచేశారు. పార్కు, పార్కులో తెలంగాణ తల్లి, బతుకమ్మ విగ్రహాలు, జాతీయ జెండా ఉన్నది. గ్రామంలో చాలామంది జాతీయ నాయకుల విగ్రహాలున్నాయి. ఈ గ్రామంలో నూతన పంచాయతీ భవనం, జాతీయ బ్యాంకు, కరెంటు సబ్‌స్టేషన్, శ్మశానవాటిక, హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం, ప్రైవేట్ పాఠశాల, రైతువేదిక, గ్రామ దేవతలు, అన్ని కులాలకు చెందిన పెద్ద పెద్ద దేవుని గుళ్లు, మసీదులున్నాయి. ఏటా ఏదో ఒక కులంవారు వారి వారి కులదేవతలకు పెద్ద ఎత్తున పండుగలు చేస్తారు.

# తెలంగాణ కేబినెట్‌లోకి ముగ్గురు మంత్రులు

ప్రస్తుతం మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర రాజనర్సింహ మంత్రివర్గంలో ఉన్నారు. మాదిగ ఎమ్మెల్యేలంతా శనివారం మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మీనాక్షి నటరాజన్‌తోనూ మాట్లాడినట్టు తెలిసింది. నాలుగో బెర్తు నింపితే కచ్చితంగా మాదిగలకు అవకాశం ఇస్తామని వారు హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించారు

## మాగంటి గోపీనాథ్ పార్థివదేహానికి కేసీఆర్ నివాళులు..

కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు, ఎంపీలు కే ఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ జోగిన పల్లి సంతోష్ కుమార్, పువ్వాడ అజయ్, భాస్కర్ రావు, పద్మారావు గౌడ్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పార్టీ నేతలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి తదితర పార్టీ నేతలు మాగంటి గోపీనాథ్ పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మాగంటి గోపీనాథ్ ఆదివారం ఉదయం 5.45 గంటలకు గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో తుదిశ్వాస విడిచారు. గురువారం సాయంత్రం (ఈ నెల 5న) తీవ్రమైన ఛాతీనొప్పితో బాధపడిన గోపీనాథ్‌ను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానకు తరలించారు. అప్పటి నుంచి హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్నారు. కార్డియాక్ అరెస్టు కావడం.. సీపీఆర్‌తో తిరిగి గుండె కొట్టుకోవడంతోపాటు నాడి సాధారణ స్థితికి వచ్చినా.. అపస్మారక స్థితి నుంచి ఆయన బయటపడలేదు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని మాదాపూర్‌లోని ఆయన నివాసానికి తరలించారు.

## ప్రభుత్వ లాంఛనాలతో మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు..


అంతకు ముందు గాల్లోకి మూడురౌండ్లు కాల్పులు జరిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలు అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. అంతకు ముందు అంతిమయాత్రలో పాడెను మోశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అయిన మాగంటి గోపీనాథ్ ?గత మూడు రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం వేకువ జామున 5.45 గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఈ నెల 5న ఆయన ఏఐజీలో చేరారు. ఈ నెల 5న ఇంట్లో ఉన్న సమయంలో హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దాంతో వెంటనే కుటుంబీకులు గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, ఎమ్మెల్యే కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు గుర్తించారు. దాంతో సీపీఆర్ చేయడంతో గుండె తిరిగి కొట్టుకుంది. నాడీ, బీపీ సాధారణ స్థితికి చేరడంతో ఐసీయూలో వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స కొనసాగించారు. అయితే, గత కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో గోపీనాథ్ బాధపడుతున్నారు. ఈక్రమంలో మూడు నెలల కిందట ఆయన ఏఐజీలోనే చేరి డయాలసిస్? చేయించుకున్నట్లు తెలిసింది. గుండెపోటు రావడంతో మూడురోజుల నుంచి చికిత్స పొందుతూనే ప్రాణాలు కోల్పోయారు.

## ఇంతమంది గవర్నర్లను ఒకే వేదికపై చూడటం అరుదు

హైదరాబాద్ లో ‘ప్రజల కథే నా ఆత్మకథ’ బండారు దత్తాత్రేయ ఆటోబయోగ్రఫీ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో అనుబంధాన్ని ఆత్మకథ పుస్తకంలో దత్తాత్రేయ పంచుకున్నారని చెప్పారు. పదవులున్నా లేకున్నా వాజ్ పేయిరీ, దత్తాత్రేయకు గౌరవం తగ్గలేదని ఆనందాన్ని వ్యక్తం చేశారు. దత్తాత్రేయ ఏ రోజు ప్రజలతో సంబంధాలు కోల్పోలేదని, ఇంతమంది గవర్నర్లను ఒకే వేదికపై చూడటం అరుదని అన్నారు. పేదలకు కష్టాలుంటే గుర్తేచ్చే నేతలు పిజెఆర్, దత్తాత్రేయ అని తెలియజేశారు. గౌలిగూడ గల్లీ నుంచి హరియాణా గవర్నర్ గా దత్తాత్రేయ ఎదిగారని ప్రశంసించారు. దత్తాత్రేయ, బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం

అందరినీ కలిపేందుకు దత్తాత్రేయ వేదిక రూపొందించారని, బండారు దత్తాత్రేయకు విరోధులు ఎవరూ ఉండరని అన్నారు. దత్తాత్రేయకు ఏ రాజకీయ పార్టీ అనే వ్యత్యాసం ఉండదని, దత్తాత్రేయది ఆదర్శ



రాజకీయ జీవితమని తెలియజేశారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాలకు, సిఎంలకు లేఖలు రాశారని, లేఖలు రాయడంలో దత్తాత్రేయ అంబాసిడర్ గా నిలిచారని పేర్కొన్నారు. హేమాహేమీలతో ప్రయాణించడం అరుదైన అనుభవమని, హైదరాబాద్ అభివృద్ధి కోసం అనునిత్యం పనిచేశారని అన్నారు. ఉత్తర, దక్షిణ భారత్ ప్రజలతో దత్తాత్రేయ మమేకమయ్యారని, భారత్ నంబర్ వన్ గా అయ్యే రోజులు తొందర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. తెలుగుజాతి అగ్రస్థానంలో ఉండేందుకు దీక్ష తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# చుట్టుముడుతున్న యుద్ధాగ్ని జ్వాలలు



రష్యాతో భారత్ తన సంబంధాలు తెంచుకోవాలని చెప్పడం ద్వారా అమెరికా దాదాపుగా భారత్‌ను హెచ్చరించినట్లుగానే భావించాలి. అమెరికా వాణిజ్య కార్యదర్శి లుట్నిక్ మాటలు డొనాల్డ్ ట్రంప్ మాటలుగానే భావించాలి. రష్యా వద్ద ఆయుధాలు కొనుగోలు చేయడం వాషింగ్టన్‌ను వ్యతిరేకించడమేనన్న అమెరికా వ్యాఖ్యలు అనుచితం. అమెరికా తన ఆర్థిక దివాళాకోరుతనాన్ని ట్రేడ్ డీల్స్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తూ ఇబ్బందిపెట్టాలని చూసిన ట్రంప్‌కు భారత్ కూడా ప్రతీకార సుంకాలతోనే గుణపాఠం నేర్పడానికి సంసిద్ధమైనది. చిరకాల మిత్రులైన భారత్- రష్యాలను విడదీయాలనే దుర్మార్గమైన ఆలోచనకు అమెరికా స్వస్తి చెప్పాలి. ఉగ్రమూకలకు స్వర్గధామమైన పాకిస్తాన్ పట్ల అమెరికా ఉదార స్వభావాన్ని ప్రదర్శించడం సిగ్గుచేటు. ఇటీవల పుతిన్- అజిత్ దోవల్ మధ్య జరిగిన సంభాషణలు అమెరికాకే కాకుండా చైనా, పాక్, బ్రిటన్‌లకు వెన్నులో వణుకు పుట్టించాయి. ఒక వైపు అమెరికా, బ్రిటన్ మరికొన్ని యూరప్ దేశాలు రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలను సరఫరా చేస్తున్నాయి. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ, భారత్‌లో మారణహోమం సృష్టిస్తున్న పాక్‌ను మందలించకుండా భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల (%వతీతీశీతీఱర ఖఱజుజుఱఅవం%) కు వెన్నుదన్నుగా నిలుస్తున్న పాక్‌ను ఎదిరించేందుకు రష్యాతో ఆయుధ ఒప్పందం కుదుర్చుకుంటున్న భారత్‌పై ఈర్ష్యాద్వేషాలను ప్రదర్శిస్తున్న అమెరికా వైఖరి అసమంజసం. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎంతో అందమైన ప్రాంతం. ఉగ్రవాదులతో, జిహాదీ శిక్షణలో ఎలాంటి అభివృద్ధి సాధించకుండా పిఓకె నిస్తేజంగా మారిపోయింది. పిఓకె ప్రజలకు తినడానికి తిండిలేదు. విద్య, ఉపాధి అవకాశాలు లేవు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్ ఇందుకు విరుద్ధం.కశ్మీర్ ప్రజలు టూరిజంతో ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఉగ్రవాదం వలన జీవితాలు ఎంత దుర్భరంగా మారతాయో అక్కడ ప్రజలకు అర్ధమైనది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొంత కాలం అలజడులు చెలరేగినా అక్కడ జరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు కశ్మీర్ ప్రజల్లో మార్పును తెచ్చిన మాట కాదనలేని సత్యం. ఎవరో కొద్ది మంది చేసే పనుల వలన కశ్మీర్‌లో ఏదో జరిగిపోతుందనుకోవడం విడ్డూరం. జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని గమనించిన తరువాత పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు కూడా భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. జై శంకర్, యోగి ఆదిత్యనాథ్, రాజ్ నాథ్ సింగ్ వంటి వారు పిఓకె స్వాధీనం గురించి ఇదివరకే తమ అభిప్రాయాలను కుండబద్దలు గొట్టినట్టు చెప్పారు. పిఓకెను భారత్ స్వాధీనం చేసుకుంటుందా? ఇందుకు చైనా, అమెరికాలు అభ్యంతరం చెప్పి, పాక్‌కు ఆయుధాలు సరఫరా చేసి భారత్‌పై యుద్ధానికి ప్రేరేపిస్తాయా? అనే విషయం తేలాలి. రష్యా- ఉక్రెయిన్ల మధ్య గత మూడున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపడం అమెరికాకు చేతకాలేదు. పైగా ట్రంప్‌ను జెలెన్స్కీ ప్రత్యక్షంగానే విమర్శించిన విషయం మరవలేం. తన మద్దతు లేకపోతే ఉక్రెయిన్ యుద్ధం చేయలేదని డాంబికాలు పలికిన అమెరికాను సవాల్ చేస్తూ, మునుపెన్నడూ లేని విధంగా రష్యాపై ఉక్రెయిన్ స్పైడర్ వెబ్ ఆపరేషన్‌ను చేపట్టి రష్యాను భయపడేలా చేసింది.రష్యాలోని కీలకమైన క్రిమియా బ్రిడ్జిని ఉక్రెయిన్ కూల్చింది. 41 యుద్ధ విమానాలు, ఒక బ్రిడ్జిని ధ్వంసం చేసి పటిష్టమైన రక్షణ వ్యవస్థ కలిగిన రష్యాకు సవాల్ విసిరిన ఉక్రెయిన్‌కు నాటో దేశాలు సహకారం అందించడం వలన జరిగే మహావిలయాన్ని ఊహించగలమా?రష్యా కూడా ఉక్రెయిన్‌కు చెందిన వందలాది మంది సైనికులను హతమార్చినట్టు ప్రకటించుకుంది. ఉక్రెయిన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా చేసిన హెచ్చరిక ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేం. రష్యాకు యుద్ధంలో సహాయం చేయడానికి ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తం చేసింది. వేలాది సైన్యం, ఆయుధాలతో కిమ్ రష్యాకు అండగా ఉండబోతున్నారు. ఉక్రెయిన్ రష్యాపై ఆకస్మికంగా దాడి చేసి ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయడం అవాంఛనీయ పరిణామంగా భావించాలి. అహం దెబ్బతిన్న రష్యా ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడడానికి సిదంగా ఉంది. రష్యా రిటాలియేషన్ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించలేం. ఈ పరిణామాల వలన అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్ పక్షాన నిలబడి భారీ యుద్ధానికి తెరతీసే అవకాశముంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకుందని అందరూ భావిస్తున్న తరుణంలో అనుకోని విధమైన మలుపులు తిరుగుతూ ప్రపంచాన్ని భయానకమైన వాతావరణంలోకి నెట్టింది. ఉక్రెయిన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌కు స్పష్టం చేసారు. ఎక్స్ ద్వారా ట్రంప్ ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. భారత్ -రష్యా సంబంధాలను అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. భారత దేశానికి అంతర్జాతీయంగా అన్నివిధాలుగా సహకరిస్తున్న ఏకైక విశ్వసనీయమైన దేశం రష్యా. అలాంటి రష్యాకు మన దేశం ఎంతో రుణపడి ఉంది. 1971లో జరిగిన ఇండో- పాక్ యుద్ధంలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు తెలిపినా, అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు అన్ని విధాలా సాయంచేసి నిజమైన స్నేహానికి నిర్వచనం చెప్పింది. అప్పటి సోవియట్ యూనియన్ నుంచి నేటి రష్యా వరకు భారత్‌కు వెన్నంటి ఉన్న మిత్ర దేశంతో భారత్‌ను వేరుచేయాలని అమెరికా విఫల ప్రయత్నాలు చేస్తున్నది. ఆసియా, ఐరోపా ఖండాల్లో విస్తరించి ఉన్న రష్యా ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో ఒక భాగం. కొన్ని దేశాల కుట్రల వలన, మిఖాయిల్ గోర్బచేవ్ విధానాల వలన ఎంతో ఖ్యాతి గాంచిన సోవియట్ యూనియన్ విడిపోయింది.15 కామన్ వెల్త్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో రష్యా ఒక కీలకమైన దేశం. సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన రష్యా ఈనాటికీ మిగిలిన ప్రాంతాల కంటే అత్యధిక ఆయుధ, సైనిక బలగం గల దేశం. అప్పటి సోవియట్ యూనియన్ మాదిరిగా రష్యా కూడా ఒక అగ్రరాజ్యం. ప్రపంచంలోనే అత్యధిక విస్తీర్ణంగల దేశంగా మైదానాలతో, వ్యవసాయ భూములతో, సహజ వనరులతో తులతూగుతున్న రష్యా అంటే ఈనాటికీ కొన్ని దేశాలకు గిట్టదు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు రష్యాకు బద్ధశత్రువులు. ఇటీవల కాలంలో రష్యాపట్ల స్నేహ వైఖరిని ప్రదర్శించినట్లు నటించిన ట్రంప్ తన దుర్బుద్ధిని చాటుకున్నారు. రష్యా కు భారత్ మరింత సన్నిహితంగా మెలగడం అమెరికాకు నచ్చడంలేదు. అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు ట్రంప్ అధికారంలోకి రావడానికి కృషి చేసారు. ఎన్నికల తర్వాత అక్రమ వలసదారుల పేరుతో భారతీయులకు సంకెళ్ళు వేసి, యుద్ధ విమానాల్లో వారిని భారత్‌కు పంపించి, ఘోరంగా అవమానించాడు. భారత్‌ను ప్రశంసిస్తూ, మోడీ తన మిత్రుడంటూనే అమెరికా అధ్యక్షుడయ్యాక ట్రంప్ భారత్‌కు వెన్నుపోటు పొడిచాడు. ట్రంప్ చేష్టలను తట్టుకోలేక అతని ఆప్తమిత్రుడైన ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌ను అభిశంసించి, గద్దె దించాలని, జెడి వాన్స్‌ను అధ్యక్ష స్థానంలో నిలబెట్టాలని ప్రయత్నించడం గమనార్హం. భారత్ విషయంలో కూడా ట్రంప్ ధోరణి సముచితంగా లేదు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యధిక జనాభా గల దేశంగా భారత్ తన సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి ఎంతో కృషి చేస్తున్నది. ఈ క్రమంలో రష్యా భారత్‌కు అన్ని విధాలా అండగా ఉంటున్నది. చైనా, పాకిస్తాన్, అజర్ బైజాన్, బంగ్లాదేశ్, టర్కీ వంటి దేశాలు భారత్‌పట్ల అకారణ విద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఒకప్పుడు ఇండో- చీనీ భాయ్‌భాయ్ అంటూనే 1962లో భారత్‌తో యుద్ధానికి తలపడి, భారత్ భూభాగాలను ఆక్రమించి చైనా నమ్మకద్రోహం చేసింది. టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు భారత్ ఆశ్రయమివ్వడమనే అంశంతో చైనా భారత్‌తో యుద్ధానికి దిగిందనే వాదనలో పసలేదు. భారత్ లోని ఈశాన్య ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా నాడు చైనా యుద్ధం చేసింది. చికెన్ నెక్‌గా పిలవబడుతున్న సిలిగురి కారిడార్‌ను వివాదాస్పదం చేసి ఈశాన్య భారతాన్ని మింగేయడానికి డ్రాగన్ దేశం విస్తృతంగా ప్రయత్నిస్తున్నది. భారత భూభాగాలను తమవిగా పేర్లు మార్చుకుంటూ భౌగోళిక పటాలను సృష్టిస్తున్నది. పాక్‌తో అంటకాగుతూ భారత్ సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తున్నది.ఇక పాకిస్తాన్ విషయం వేరే చెప్పాల్సిన అవసరం లేదు. పాకిస్తాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పటికీ, భారత్‌ను ఇంకా ఉగ్రవాదంతో ఇబ్బందులకు గురిచేస్తున్నది. భారత్‌లో కశ్మీర్ విలీనం రాజా హరిసింగ్ నేతృత్వంలో చట్టబద్ధంగా జరిగినా కశ్మీర్‌లోని కొంత భూభాగాన్ని పాక్ ఆక్రమించుకుంది. అదే పాక్ ఆక్రమిత కశ్మీర్. పాక్ ఆక్రమిత కశ్మీర్ కేవలం ఉగ్రవాదులకు నిలయం. ఇక్కడ నుండే ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ కొనసాగిస్తూ, ఎల్‌ఓసివద్ద కాల్పులు జరుపుతూ, కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి ప్రవేశపెట్టి, భారత్‌లో అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటున్నది. పహల్గాం దారుణ మారణకాండకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పింది. భారత్ ఆయుధ శక్తికి బెంబేలెత్తిన పాక్ కాల్పుల విరమణకు ప్రతిపాదన చేయడంతో భారత్ తాత్కాలికంగా శాంతించింది. అయినప్పటికీ పాక్, పాక్‌కు వత్తాసు పలుకుతున్న శత్రుదేశాల కుయుక్తులనుండి దేశాన్ని కాపాడుకోవడానికి భారత్ తన మిత్రదేశమైన రష్యాతో ఆయుధాల విషయంలో సంప్రదింపులు జరుపుతున్నది. అమెరికాకు భారత్ వైఖరి నచ్చడం లేదు. రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ఆపలేని అమెరికా తానేదో భారత్‌ను ట్రేడ్ డీల్ ద్వారా బెదిరించి, దారికి తెచ్చానని చెప్పడం విడ్డూరం. ఏదిఏమైనప్పటికీ వర్తమాన ప్రపంచం యుద్ధాల రూపంలో ఒక పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మాట వాస్తవం. ప్రపంచానికి పెద్దన్నలా వ్యవహరించే అమెరికా సమస్యను మరింత జటిలం చేస్తున్నది. డొనాల్డ్ ట్రంప్ మాటలు చేష్టలు యుద్ధాలను ఆపకపోగా, ఆయుధ వ్యాపారానికి యుద్ధాలను వాడుకుంటున్న దాఖలాలు కనబడుతున్నాయి. ఐక్యరాజ్య సమితితోపాటు, బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన కొన్ని దేశాలు ప్రస్తుత యుద్ధ సంక్షోభాన్ని నివారించడానికి ఎలాంటి కృషి చేయడం లేదు. ఇజ్రాయెల్- పాలస్తీనా, రష్యా- ఉక్రెయిన్, ఇండో- పాక్‌ల మధ్య ఏర్పడిన తీవ్రమైన సంఘర్షణను తేలిగ్గా తీసుకోవడం ఆక్షేపణీయం.

# ఎన్నికలబాట పట్టిన బంగ్లాదేశ్



బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనస్ ఎట్టకేలకు సాధారణ ఎన్నికల నిర్వహణకు ముందుకు రావడం ముదావహం. ఇదిగో అదిగో అంటూ దిక్కుమాలిన సాకులు చూపి, ఎన్నికల నిర్వహణను నెలల తరబడి వాయిదా వేస్తూ వచ్చిన యూనస్ చివరకు అటు ప్రజాస్వామ్యవాదులు, ఇటు సైన్యం ఒత్తిడికి తలవంచక తప్పలేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ ప్రథమార్థంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహిస్తామంటూనే గతంలో ఎన్నికలు పక్షపాతపూరితంగా జరిగాయని గత ప్రభుత్వాధినేత షేక్ హసీనాపై అక్కసు వెళ్లగక్కారు. బంగ్లాదేశ్ ప్రస్తుత సంక్షోభానికి గతంలో జరిగిన పక్షపాతపూరిత ఎన్నికలే కారణమని, తన ప్రభుత్వం మాత్రం స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. తన తప్పిదాలు కప్పిపుచ్చుకునేందుకు వైరి పక్షంపై నిందలు మోపుతున్న యూనస్, ఎన్నికల నిర్వహణకు 20 నెలల సుదీర్ఘ సమయం దేనికి తీసుకుంటున్నారన్న ప్రశ్నకు ఏం సమాధానం చెబుతారు? ఎటువంటి పాలనానుభవం లేని ఈ పెద్దమనిషికి కుటిల రాజకీయ పరిజ్ఞానం మాత్రం పుష్కలంగానే ఉన్నట్లు గత పదినెలల ఆయన పాలన చెప్పకనే చెబుతోంది. వెల్లువెత్తిన ప్రజానిరసనల ధాటికి తట్టుకోలేక గత ఏడాది జూన్‌లో అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పరారై ఇండియాకు వచ్చి తలదాచుకున్న అనంతరం బంగ్లాదేశ్‌లో పరిస్థితులు [illegible] ఇకనైనా చక్కబడతాయనుకున్న ప్రజాస్వామ్యవాదుల ఆశలను యూనస్ అడియాసలు చేశారనడంలో సందేహం లేదు. హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో బంగ్లా ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దానికితోడు హసీనాతో తనకున్న పాత వైరాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆమెకు ఆశ్రయం కల్పించినందన్న అక్కసుతో ఇండియాతో తెగతెంపులు చేసుకోవడానికి కూడా సిద్ధపడటం ఆయన దుందుడుకు వైఖరికి నిదర్శనం. స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణలో కీలకపాత్ర పోషించిన అవామీలీగ్ పార్టీది ఏడున్నర దశాబ్దాల ఘన చరిత్ర. షేక్ హసీనాతో వ్యక్తిగత విభేదాల కారణంగా దేశ తాత్కాలిక సారథి యూనస్ ఆ పార్టీపై ఇటీవల ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధం విధించడం ప్రజాస్వామికవాదులను ఆశ్చర్యానికి గురిచేసింది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో అవామీలీగ్ నేతలపై నడుస్తున్న కేసుల విచారణ పూర్తయ్యేవరకూ నిషేధం కొనసాగుతుందని యూనస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో అవామీలీగ్ పోటీ చేసే అవకాశాలు అడుగంటినట్లే. ఎందుకంటే, అప్పటివరకూ విచారణ పూర్తికాకుండా యూనస్ ప్రభుత్వం చేయవలసినదంతా చేస్తుంది. షేక్ హసీనాపై బనాయించిన వందకు పైగా కేసులు ఒక కొలిక్కి రావడానికి ఏళ్లూపూళ్లూ పడుతుందన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. గత ఏడాది ఆగస్టు 8న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా పదవీబాధ్యతలు చేపట్టిన యూనస్, అవామీలీగ్ నియంతృత్వ విధానాలనుంచి దేశానికి విముక్తి కల్పించి, దేశాన్ని ప్రజాస్వామిక పంథాలో నడిపిస్తానని శపథం చేశారు. కానీ పదవి చేపట్టి పదినెలలు దాటినా ఇప్పటికీ పాలనపై పట్టు సాధించలేదు సరికదా శాంతిభద్రతల పరిస్థితి సైతం నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్న చందంగా మారింది. ఆయన పాలనలో విదేశాంగ విధానమూ కప్పదాట్లు తొక్కుతోంది. ఇప్పటివరకూ బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇండియాతో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకొంది, అందుకు భిన్నంగా యూనస్ కోరి కయ్యానికి కాలుదువ్వుతున్నారు. ఇండియా సహకారమే లేకపోతే బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ప్రపంచపటంలో స్థానం సంపాదించుకుని ఉండేది కాదన్న ఇంగితం మరచిన బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక అధినేత, చైనా, పాకిస్తాన్‌లకు దగ్గరయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు విస్తుగొలుపుతున్నాయి. అవామీలీగ్‌పై నిషేధం ఉన్న కారణంగా రాబోయే ఎన్నికల్లో పోటీ ప్రధానంగా మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ), కొత్తగా ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ, జమాత్ ఏ ఇస్లామీల మధ్యే ఉంటుంది. బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఎన్‌పీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇండియాతో దౌత్య, వాణిజ్య బంధాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, తాజాగా ఆ పార్టీ ఇండియాతో స్నేహసంబంధాలను కోరుకుంటున్నామని ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామం. ఇది ఇండియాకు కూడా కలిసివచ్చేదే. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం చైనా, పాకిస్తాన్‌లతో అంటకాగేందుకు ఉవ్విళ్లూరుతున్న నేపథ్యంలో బీఎన్‌పీకి పరోక్షంగా మద్దతు ప్రకటించడం ఇండియాకు అత్యంత ఆవశ్యకం.

## ఆరోగ్య మంత్రి ఆదేశాన్ని తోసిపుచ్చిన గోవా సీఎం..

### డాక్టర్‌ను సస్పెండ్ చేయబోమని హామీ

పనాజి: గోవా ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే ఆదేశాన్ని సీఎం ప్రమోద్ సావంత్ తోసిపుచ్చారు. సీనియర్ డాక్టర్‌ను సస్పెండ్ చేయబోమని హామీ ఇచ్చారు. ఈ వివాదాన్ని సమీక్షించినట్లు సీఎం ప్రమోద్ సావంత్ ఆదివారం తెలిపారు. ఆరోగ్య మంత్రితో తాను చర్చలు జరిపినట్లు చెప్పారు. 'డాక్టర్ రుద్రేష్ కుట్టికర్‌ను సస్పెండ్ చేయబోమని గోవా ప్రజలకు నేను హామీ ఇస్తున్నా. ప్రతి పౌరుడికి అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఆరోగ్య సంరక్షణకు అంకితభావంతో కూడిన వైద్య బృందం, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నది. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల అవిశ్రాంత కృషి, అమూల్యమైన సేవలను కూడా మేం అభినందిస్తున్నాం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే శనివారం ఆకస్మికంగా బాంబోలిమ్‌లోని గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను సందర్శించారు. క్యాజువాలిటీ వార్డులో తన అత్తపై డాక్టర్ అహంకారంగా ప్రవర్తించారన్న సీనియర్ జర్నలిస్ట్ ఆరోపణలను మంత్రి ప్రస్తావించారు. సహనం కోల్పోయిన ఆయన చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) డాక్టర్ రుద్రేష్‌పై అందరి ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆ సీనియర్ డాక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అక్కడికక్కడే ఆదేశించారు. మరోవైపు డ్యూటీలో ఉన్న సీఎంవోను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే తీరును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తప్పుపట్టింది. అయితే తన చర్యను ఆ మంత్రి సమర్థించుకున్నారు. రోగి పట్ల ఆ వైద్యుడు అహంకారపూరితంగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. వైద్య సేవలు నిరాకరించిన రోగికి తాను అండగా నిలిచినట్లు చెప్పారు. అందుకే ఆ డాక్టర్‌తో తన ప్రవర్తనపై క్షమాపణ చెప్పబోనని మీడియాతో అన్నారు.

## అవాస్తవాలు ప్రచారంలో ముందున్న రాహుల్

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో ఆయనపై భాజపా తీవ్ర విమర్శలు చేస్తోంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ రాహుల్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రాష్ట్ర ఓటర్లను అవమానించారని,. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలి. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం ఆయన అలవాటుగా మార్చుకున్నారు. తాను ఏం మాట్లాడుతున్నారో అతడికైనా అర్థం అవుతోందా..అని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారం మానుకోకపోతే ఆయన పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. వారి తీరు ఇలాగే కొనసాగితే ఎప్పటికీ గెలవలేరు. ఈ విషయాన్ని రాహుల్ అర్థం చేసుకోవాలి. ఇకనైనా మేలుకోండి అంటూ హెచ్చరించారు. గతంలో ఆయన చేసిన అసత్య ప్రచారంపై స్పందించిన ఎన్నికల కమిషన్ సాక్ష్యాధారాలతో అవన్నీ అసత్యాలని నిరూపించింది. గత ఎన్నికల ఓటర్ల జాబితాను తాజాగా విడుదల చేసింది. అసత్యాలు మాని ప్రజలకు మంచి చేసేందుకు కృషి చేయండని ఫడణవీస్ సూచించారు. కాగా.. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నకిలీ ఓటర్ల నమోదు, పోలింగ్‌లో అవకతవకలు, ఆధారాలను దాయడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. భాజపా ఎందుకు అలా ప్రవర్తించిందో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదని.. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్ లాంటిదని వ్యాఖ్యానించారు. మోసం చేసే పార్టీ ఆటలో గెలవొచ్చు.. కానీ అలాంటి విజయం వ్యవస్థలను దెబ్బతీస్తుందని రాహుల్ అన్నారు. మహారాష్ట్ర వలే బిహార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కానుందని విమర్శించారు. దీనిపై స్పందించిన భాజపా రాహుల్‌కు కౌంటర్ ఇచ్చింది.

### ఢిల్లీ సిఎంను బెదిరించిన వ్యక్తి అరెస్ట్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తానని బెదిరించిన శ్లోక్ త్రిపాఠి అనే వ్యక్తిని ఢిల్లీ పోలీసులు, ఘాజియాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టు చేశారు. అతడు తాగిన మత్తులో, భార్యతో గొడవ పడిన నేపథ్యంలో అలా అన్నట్టు– ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది. నిందితుడిని కొత్వాలి ప్రాంతంలో పట్టు–కున్నారు. కాగా నిందితుడి లొకేషన్ పంచవటి ప్రాంతంలో గుర్తించారు. బెదిరింపుకు ఉపయోగించిన సిమ్ అడ్రస్ గోరఖ్‌పూర్‌కు చెందింది, పైగా అది అతడి బంధువు పేరిట తీసుకున్నదని వెల్లడయింది. శ్లోక్ త్రిపాఠి ఇదివరలో ఘాజియాబాద్ కోర్టులో పనిచేశాడు.


# చచ్చేటంత అభిమానం దేనికి?

వినోదాన్ని విషాదంగా మారుస్తున్న సంఘటనలు దేశంలో తరచూ జరగడం ఇప్పుడు మనం చూస్తున్నాం. ముఖ్యంగా ప్రజలకు వినోదాన్ని అందించే సినిమా, క్రికెట్ రంగాలకు చెందిన నటులకోసం, క్రీడాకారులకోసం ప్రాణాలు పోగొట్టుకునే స్థితికి చేరుకుంటున్నారు అభిమానులు. ఇప్పుడు మతం, రాజకీయాలు, సినిమా, క్రికెట్.. ఈ నాలుగింటి చుట్టే ప్రపంచం తిరుగుతున్నట్టుగా కనిపిస్తుంది మనకు. జరుగుతున్న సంఘటనలు చూస్తే మితిమీరిన అభిమానం కారణంగా మతసంబంధమైన సభలు, రాజకీయ సభలు, సినిమా ఈవెంట్లు, క్రికెట్ మ్యాచ్‌ల కోసం జమగూడే ప్రజలు ప్రమాదాలకు గురికావడం, విలువైన ప్రాణాలు కోల్పోవడం, ఉజ్వల భవిష్యత్తును అర్థంతరంగా ముగింప చేసుకోవడమే కాకుండా కుటుంబాలకు తీవ్ర దుఃఖాన్ని మిగులుస్తున్నారు. మూడు రోజుల క్రితం బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట సంఘటన చూసిన తర్వాత వీటిని అరికట్టవలసింది ఎవరు? జాగ్రత్తలు తీసుకోవాల్సింది ఎవరు? పదేపదే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా ముందు జాగ్రత్త చర్యలు లేకపోవడానికి కారకులెవరు? అన్న అంశాలమీద తీవ్రమైన చర్చ జరుగుతున్నది. ఈ సంవత్సరం ఆరంభంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో అధికారికంగా మృతుల సంఖ్య 30గానే ప్రకటించినా ఇంకా చాలామంది చనిపోయి ఉంటారని పరిశీలకులు, మీడియా చెప్తున్న విషయం. కోట్లమంది పాల్గొనే ఇటువంటి కార్యక్రమంలో 30 మంది చనిపోతే విశేషమేముందని ఎవరైనా వాదించవచ్చు. కానీ, ఎవరూ అసహజ మరణానికి గురికాకూడదన్న స్పృహ లేనివారే అలా మాట్లాడతారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గతంలో కూడా మనం తొక్కిసలాటలు, మరణాలకు సంబంధించిన వార్తలు విన్నాం. పదేళ్లక్రితం గోదావరి పుష్కరాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాష్ట్ర అధినేత ప్రచారంకోసం చేసిన ఆర్భాటం కారణంగా జరిగిన తొక్కిసలాటలో దాదాపు 30 మంది మరణించిన విషయం తెలిసిందే. రాజకీయ సభల్లోనూ జాగ్రత్తలు తీసుకోని కారణంగా జరిగిన విషాదాలు అనేకం. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలకు ముందు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధినేత నెల్లూరు జిల్లాలోని కందుకూరు అనే చోట తన సభకు వచ్చిన జనం అధిక సంఖ్యలో కనిపించడం కోసం చేసుకున్న ఏర్పాట్ల కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఎనిమిదిమంది మరణించారు. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని ముక్తి పొందాలనుకున్న భక్తులు టికెట్ల కోసం ఏర్పాటైన క్యూలో నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు. తాజాగా ఇంకా మన జ్ఞాపకాల్లోంచి తొలగిపోని సినిమా సంఘటన హైదరాబాద్‌లో జరిగింది. ఓ ప్రముఖ నటుడు తన సినిమా ప్రీమియర్ షోకు వెళ్తే, ఆయనను చూడడానికి ఎగబడిన అభిమానుల మధ్య జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందడం, మరొక బాలుడు గాయాలపాలై నెలల తరబడి స్పృహ లేకుండా ఆసుపత్రిలో పడి ఉండడం చూశాం. ఇప్పుడు ఐపిఎల్ విజేతలైన బెంగళూరు రాయల్ చాలెంజర్స్ ఆటగాళ్ళను అభినందించడం కోసం బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయారు. 11 మంది ఆడే క్రికెట్ ఆట ఓ 11మంది ప్రాణాలు తీయడానికి దారి తీసింది. మత సంబంధమైన కార్యక్రమాల్లో గాని, రాజకీయ సభల్లో గాని, సినిమా ఫంక్షన్లలో గాని, క్రికెట్ స్టార్లను చూడడానికి ఎగబడిన జనసందోహంలో గానీ ప్రాణాలు కోల్పోతున్నవాళ్ళు ఎవరు? వాళ్ళను ఆయా సందర్భాలకు తగిన పేర్లతో పిలుచుకుంటాం. మత సంబంధమయిన కార్యక్రమాలలో పాల్గొంటే భక్తులని, రాజకీయ సభలయితే కార్యకర్తలు, ప్రజలు అని, సినిమా ఫంక్షన్లయితే ప్రేక్షక దేవుళ్ళు, క్రికెట్ ఆట చూడటానికి వెళితే క్రీడాభిమానులు అని. అయితే మొత్తంగా వీళ్లంతా మనుషులు. చదువుకుని పైకి రావలసిన వాళ్ళు, తమ కుటుంబాలకు ఆధారంగా ఉండవలసిన వాళ్ళు, ఎన్నో బాధ్యతలు మోస్తున్నవాళ్ళు అయి ఉంటారు. ఎందుకు ఇది రోజురోజుకు ఇలా పెరుగుతున్నది? వ్యక్తులు, వ్యవస్థ దీనిగురించి ఆలోచించి బెంగళూరు సంఘటన తర్వాత మరొక్క మనిషి కూడా ఇలా అసహజ మరణానికి గురికాకుండా చూడాల్సిన అవసరం ఉన్నది. బెంగళూరు విషాదంలో మరణించినవారిలో 13 ఏళ్ల బాలిక తప్ప అంతా 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు వాళ్లే. ఒక్కరు మాత్రమే 35 సంవత్సరాల వ్యక్తి. వీరంతా తమ కుటుంబాలకు విషాదం మిగిల్చి తరలిపోయారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందినవాళ్లే. రోజు కూలి చేసుకునే, పానీ పూరి అమ్ముకొని జీవించే, కష్టం చేసుకుని బతికే తమ తల్లిదండ్రులకు మంచి జీవితం ఇవ్వడం కోసం ఉన్నత చదువులు చదువుకుంటున్నవాళ్లు. ఇప్పుడా కుటుంబాలకు దిక్కెవరు? పోనీ, అదేమీ భారతజట్టు ప్రపంచ కప్ గెలుచుకొచ్చిన సందర్భం కాదు. అది ప్రజలకు ఉచితంగా వినోదాన్ని అందించే క్రీడగా కూడా లేదు. అదొక వ్యాపారం. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అనే ఒక ఫ్రాంచైజీ టీం. డబ్బుగలవారు ఇటువంటి టీంలను కొనుక్కుని ఆడించి మరింత డబ్బు, పలుకుబడి సంపాదించుకునే ఆట. ఆ జట్టు బెంగళూరు తరఫున ఆడి గెలిచింది కాబట్టి బెంగళూరులో సంబరాలు చేసుకున్నారు అనుకోవచ్చు. జట్టు గెలిచిన రోజు రాత్రి హైదరాబాద్ నగరంలో సచివాలయం ఎదుట నెక్లెస్ రోడ్‌లో జరిగిన ఉన్మాద ప్రదర్శనను ఎలా చూడాలి? ఇది దురభిమానానికి పరాకాష్ఠ. అక్కడ మెట్రో రైల్ బ్రిడ్జి కింద క్రికెట్ అభిమానులు బాణాసంచా కాల్చి జనం మీదకు తిప్పుతూ తమ ఉన్మాదాన్ని ప్రదర్శించారు. ఆ గెలిచింది హైదరాబాద్ జట్టు కాదు, అందులో ఒక్క హైదరాబాద్ ఆటగాడైనా లేడు. అటువంటప్పుడు హైదరాబాద్‌లో ఎందుకీ ఉన్మాద ప్రదర్శన? క్రికెట్ అనే క్రీడకు అభిమానులు ఎక్కడైనా ఉంటారు. ఇది ప్రపంచ స్థాయి క్రీడ అనుకుంటే దానిపట్ల రోజురోజుకూ పెరుగుతున్న దురభిమానం ఉన్మాదస్థాయికి చేరుకోవడం చూస్తున్నాం. బెంగళూరు సంఘటననే తీసుకుంటే విజయోత్సవం ఏర్పాటుచేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు యాజమాన్యం, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ మాత్రమే ఈ దుర్ఘటనకు బాధ్యత వహించాలా? రాష్ట్ర ప్రభుత్వానికి, దాని అధీనంలో పనిచేసే పోలీసు వ్యవస్థకు ఏం సంబంధం లేదా? నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నా, తీసుకోకపోయినా ఆ కార్యక్రమం జరగబోతున్నట్టుగా ముందుగానే ప్రకటించి ఉన్నారు. అంతేకాకుండా ఉచిత ప్రవేశం అనే ప్రచారం కూడా జరిగిన కారణంగా అభిమానులు పెద్దసంఖ్యలో గుమికూడబోతున్నారని పోలీస్ శాఖ ఊహించకపోవడం, కట్టుదిట్టమైన చర్యల కోసం తగిన బలగాలను అక్కడ మోహరించకపోవడం కచ్చితంగా పోలీస్ శాఖ వైఫల్యం కిందకే వస్తుంది. ఇటువంటి సంఘటనలు మామూలే అన్నట్టుగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు గతంలో ఇంకెక్కడో తమ వైరిపక్షాలు అధికారంలో ఉన్నచోట జరిగిన సంఘటనలను ఉదహరించడం సబబు కాదు. దీనికి సంబంధించి హైదరాబాదులో ఆ రాత్రి జరిగిన సంఘటన మీద నగర కొత్వాల్ సివి ఆనంద్ చేసిన ఒక ట్వీట్‌కు స్పందిస్తూ ఒక పౌరుడు ఇలా ముందు సమాచారం లేకుండా వీధిలోకి వచ్చి జనానికి ఇబ్బంది కలిగించే మూకలను వీడియోలలో గుర్తించి వారి మీద సంబంధిత సెక్షన్లకింద కేసులు నమోదు చేయవచ్చునని సూచించారు. క్రికెట్ అభిమానులే కాదు, వివిధ సందర్భాల్లో ఇలా వేళ కాని వేళలో, ఎటువంటి భద్రతా చర్యలకు అవకాశం లేని విధంగా జనానికి ఇబ్బందులు కలిగించే వారి మీద కనీస చర్యలు ఉంటే తప్ప ఇటువంటి వారి కట్టడం సాధ్యం కాదు. పరిపాలన వ్యవస్థ.. ముఖ్యంగా పోలీస్ శాఖ ఈ దిశగా ఆలోచన చేస్తే భవిష్యత్తులో మరిన్ని సంఘటనలు జరగకుండా, మరికొంతమంది అమాయకంగా ప్రాణాలు పోగొట్టుకోకుండా చూసినవాళ్ళు అవుతారు. భక్తులు, అభిమానులు, కార్యకర్తలు కూడా సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయం ఒకటి ఉంది. నాయకులు, మతగురువులు, సినిమాస్టార్లు, క్రికెట్ హీరోలు బాగానే ఉంటారు, హద్దులు మీరిన అభిమానం ప్రదర్శించడంవల్ల వ్యక్తిగతంగా నష్టపోయేది అభిమానులే. హైదరాబాదులోని సంధ్యా థియేటర్ దగ్గర జరిగిన సంఘటన తదనంతర పరిణామాలు ఇందుకు మంచి ఉదాహరణ. ఆనాటి తొక్కిసలాటకు కారణం అయిన నటుడిమీద పోలీసులు కేసు పెట్టి ఒకటి రెండు రోజులు హడావిడి చేసినా ఆ తర్వాత అందరూ ఆ విషయాన్ని మర్చిపోయారు. అంతేకాదు, అదే పోలీసు వ్యవస్థ మీద అజమాయిషీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సినిమా అవార్డుల కమిటీ ఆ నటుడిని అదే సినిమాకు ఉత్తమ నటుడి అవార్డుకు ఎంపిక చేసింది. ప్రాణం పోగొట్టుకున్నది అభిమాని, అవార్డు గెలుచుకున్నది అందుకు కారకుడైన నటుడు. ఇదీ పరిస్థితి.



## ప్రజల ప్రాణాలతో 'రసాయన' చెలగాటం

బ్రెజిల్‌లో జూన్ 3వ తేదీన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరంలో వాతావరణ సంక్షోభంపై జరిగిన సెమినార్‌లో భారత్ తరఫున ఎంపీ బైరెడ్డి శబరి అద్భుతంగా ప్రసంగించారు. 1970లో చిప్కో ఉద్యమాన్ని ప్రపంచం ముందుంచి, పర్యావరణ పరిరక్షణ కోసం భారత్ చేస్తున్న కృషిని బ్రిక్స్ దేశాలకు వివరించారు. కానీ, ఆమె ప్రసంగానికి కొన్ని గంటల ముందు జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ విధ్వంసానికి పాల్పడింది. బహుశా ఈ ఘటన గురించి తెలిసి ఉంటే, ఆమె అలా ప్రసంగించేవారు కాదు. పర్యావరణం కాలుష్య భరితంగా మారుతున్న ప్రస్తుత కాలంలో వినాశనానికి దారితీస్తున్న అంశాలపై చర్చించుకోవాల్సిన బాధ్యత ఆరోగ్యవంతమైన జీవన మనుగడను కోరుకునేవారిపై ఉన్నది. చట్టాలను రూపొందించే స్థానాల్లోకి పారిశ్రామికవేత్తలు రావడంతో పర్యావరణ చట్టాలు వారికి చుట్టాలుగా మారిపోయాయి. అభివృద్ధి మాటున జరుగుతున్న పర్యావరణ విధ్వంసం గురించి తెలుసుకోకపోతే సకల జీవరాశుల భవిష్యత్తు తరాలను ప్రమాదంలోకి నెట్టినవారవుతాం. అభివృద్ధికి నోచుకోని,ఆర్థికంగా, విజ్ఞానపరంగా వెనుకబడిన ప్రాంతాలపై కార్పొరేట్ల కన్ను ఎప్పుడూ ఉంటుంది. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న తెలంగాణలోని ఉమ్మడి పాలమూరు, ఏపీలోని కర్నూల్ జిల్లాల పరిధిలో ఉన్న తుంగభద్ర, కృష్ణా నదుల తీరం వెంట ఫ్యాక్టరీలను నెలకొల్పుతూ పాలకులే పర్యావరణ పరిరక్షణ చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. పారిశ్రామికవేత్తలు రాజకీయ నాయకుల అవతారమెత్తడంతో పర్యావరణం మరింత ప్రమాదంలోకి జారుకుంటున్నది. తమ అభిప్రాయాలనే ప్రజాభిప్రాయాలుగా పోలీసుల పహారాలో వారు తీర్మానాలు చేసుకుంటున్నారు. భవిష్యత్తు తరాలకు మేలైన సమాజం కోసం గొంతెత్తే వారిని అభివృద్ధి నిరోధకులుగా, సంఘ వ్యతిరేక శక్తులుగా పాలకులు చిత్రీకరిస్తున్నారు. గద్వాల జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ కొన్ని నెలలుగా అక్కడి రైతులు ఆందోళనలు చేస్తున్నారు. కానీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు అర్ధరాత్రి స్వరాష్ట్ర కలలను చిద్రం చేస్తూ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూనుకున్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు నిషేధించిన పీఎఫ్‌వోఏ రసాయనం ఉత్పత్తిని చేపట్టవద్దంటూ అభిప్రాయాన్ని చెప్పేందుకు వెళ్లిన ప్రజలపై, ప్రజాసంఘాల నాయకులపై కర్నూల్ జిల్లా తుంగభద్ర నది ఒడ్డున రాజకీయ నాయకుడిగా మారిన పారిశ్రామికవేత్త దాడి చేయించారు. పర్యావరణ పరిరక్షణకు కాపలా ఉండాల్సిన నాయకులే కాలుష్య సమాజం కోసం పాకులాడుతుండటం దురదృష్టకరం. ఫ్యాక్టరీల ఏర్పాటుతో కొంత మేర ఆస్తి నష్టం జరిగినా.. నీరు, వ్యవసాయ భూమి లభ్యత తగ్గినా పర్వాలేదు. కానీ, తమ మనుగడే ప్రమాదంలో పడితే, భవిష్యత్తు తరాల ఉనికే ప్రశ్నార్థకంగా మారితే ప్రజలు కచ్చితంగా ఆందోళనలు చేస్తారు, చేయాలి కూడా. గద్వాల జిల్లా, కర్నూల్ జిల్లాల్లో ఏర్పాటుచేసే లేదా విస్తరించే ఫ్యాక్టరీల మూలంగా ఆ ప్రాంతాలకే నష్టం జరుగుతుందని అనుకోవడం పొరపాటే. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల వాయు కాలుష్యంతో పాటు నేల, నీటి కాలుష్యం జరుగుతుంది. శ్వాసకోశ, చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నది. ముఖ్యంగా పంటల దిగుబడి తగ్గిపోతుంది. నాణ్యత దెబ్బతింటుంది. పాలమూరు గ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన వనరు. రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తే పాలమూరు జిల్లా మళ్లీ వలసలమయం అవుతుంది. కర్నూల్ జిల్లా నది ఒడ్డున విస్తరించాలని చూస్తున్న ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే రసాయనాల మూలంగా పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందని నిపుణులు ఇప్పటికే ధ్రువీకరించారు. పీటీఎఫ్ఈ ఉత్పత్తిలో వాడే పీఎఫ్ఏఎస్(పర్– పాలీఫ్లోరోఅల్కైల్) రసాయనాలు పర్యావరణాన్ని కాలుష్యం చేస్తాయి. పీఎఫ్‌వోఏ వంటి హానికరమైన పదార్థాలను ఇవి విడుదల చేస్తాయి. పీఎఫ్‌వోఏ వాతావరణంలో సులభంగా కలిసిపోతుంది. అంతేకాదు, వాతావరణం నుంచి అంత త్వరగా తొలగిపోదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ సంస్థ ఈ రసాయనాన్ని క్యాన్సర్ కారకంగా వర్గీకరించింది. ఫ్యాక్టరీ యాజమాని ప్రభుత్వంలో భాగస్వామి కావడంతో పర్యావరణ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరిగే ఆస్కారం ఉంటుంది. వరదలు వచ్చినప్పుడు రసాయన వ్యర్థాలు నదిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే కర్నూల్ జిల్లాతోపాటు జోగులాంబ జిల్లాలోని అలంపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ ప్రాంతాలు భవిష్యత్తు లో క్యాన్సర్ ప్రభావిత ప్రాంతాలుగా మారుతాయి. ఈ ఫ్యాక్టరీ వల్ల తెలంగాణలోని నదీ తీర ప్రాంతాలకే ఎక్కువ నష్టం జరుగుతుంది. పీఎఫ్‌వోఏ రసాయనం మూలంగా సంభవించే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యాన్ని గుర్తించిన చాలా దేశాలు దీన్ని నిషేధించాయి. 2014లో అమెరికా, 2020లో యూరోపియన్ యూనియన్ దీన్ని పూర్తిగా నిషేధించాయి. కానీ, మన దేశంలో, మన రాష్ట్ర సరిహద్దులోని తుంగభద్ర తీరం వెంబడి మాత్రం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా రసాయనాల ఉత్పత్తికి పూనుకున్నారు. మే 14న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అక్కడి ప్రజాసంఘాల నాయకులపై దాడి జరిగింది. దీంతో కర్నూల్ జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన బాటపట్టారు. కానీ, తెలంగాణ ప్రభుత్వంలో మాత్రం చలనం లేదు. అమాయక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్య కారక రసాయనాలపై విచారణ చేపట్టాలి. అంతేకాదు గద్వాల జిల్లాలో ఏర్పాటు చేయాలనుకుంటున్న ఇథనాల్ ఫ్యాక్టరీ మూలంగా కలిగే నష్టాలపై రైతులు, ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.



# సంపాదకీయం

## సమగ్ర పంటల బీమాపై ఆలోచన చేయండి !

అకాల వర్షాలు మరోమారు తెలుగు రాష్ట్రాల రైతులను దెబ్బతీసాయి. పంటచేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో పంటలు నేలకొరిగాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు రాక..అప్పుల్లో కూరుకు పోతున్నారు. ఏలా ఇది జరుగుతున్న తంతే. వరి, బొప్పాయి, మామిడి, మక్కజొన్న తదితర పంటలు ఇలా దెబ్బతింటున్నాయి. అన్నదాతల పంటలసాగు జూదంలా మారింది. పంటలు దండిగా పండితే మద్దతు ధరలు ఇవ్వరు. పంటలు చేతికొస్తాయనుకుంటే వడగళ్లకు నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్ట పరిహారం కూడా ప్రహసనంగా మారింది. అధికారులు రావాలి..అంచనాలు వేయాలి...తరవాత అరకొ సాయం అందుతుంది. కొందరికి అదికూడా అందదు. ఇంతటి దౌర్భాగ్యంలో రైతులు ఉన్నా..ఊరడించే పాలకులు సకాలంలో సాయం చేసే చర్యలు తీసుకోరు. నిజానికి సమగ్ర పంటలబీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలి. ప్రీమియం ప్రభుత్వాలే కట్టుకుంటే..రైతులకు పంటనష్టపోయినప్పుడు నూటికనూరు శాతం నష్ట పరిహారం వచ్చేలా చేయాలి. అప్పుడు అన్నదాత నిశ్చితంగా పంటలు సాగుచేస్తారు. సమగ్ర పంటల బీమాతో రైతులను ఆదుకునేలా ప్రణాళికలను అత్యవసరంగా సిద్ధం చేయాల్సి ఉంది. మనిషికి, పశు వులకు, వాహనాలకు, ఇళ్లకు బీమా చేస్తున్న పద్దతిలోనే పంటల బీమాకు కూడా ప్రణాళిక చేయాల్సి ఉంది. ఇకపోతే ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించి.. వారంతా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహిం చడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్ట పోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్ధిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాల వర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు, విలయం సంభవించి నప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయక పోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఎప్పుడు ఎలా చెల్లించాలో గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు దండోరా వేసి రైతుల దృష్టికి తీసుకుని రావాలి. బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది సీజన్‌కు ముందే కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్క జొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు కూడా బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది.
మిర్చి,పత్తి,శనగ తదితర రైతులు నష్టం సంభవించి నప్పుడు ఏ విధంగా పరిహారం పొందవచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామిక వేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి. అప్పుడే దేశంలో రైతులకు భరోసా దక్కుతుంది. దీనిని అత్యవసర విషయంగా గుర్తించి రాష్ట్రాలు కూడా ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్రంతో చర్చిస్తే మంచిది.

## కాళేశ్వరాన్ని పునరుద్ధరిస్తేనే మనకు భవిష్యత్తు



మానవ మనుగడకు కావాల్సినవి ప్రధానంగా గాలి, నీరు.సకల జీవకోటికి ప్రాణాధారమైన నీటి కోసం దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య యుద్ధాలూ జరుగుతున్నాయి. ఆ నీటి కోసం జరిగిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ చరిత్రను ఒకసారి పరికించి చూస్తే నాడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దుర్భరంగా ఉండే ది. ఒకవైపు కులవృత్తులు కనుమరుగైపోయి, మరోవైపు నీటి వసతి లేక రైతులు కరువు కోరల్లో చిక్కుకున్నారు. ఆకలి కేకలతో తెలంగాణలో బతుకలేక, చావలేక ఎన్నో కుటుంబాలు వలసెల్లిపోయాయి. కొంతమంది రైతులు ఉన్న ఊరిని, కన్న తల్లిని విడిచిపోలేక ఎడాపెడా బోర్లు వేసి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఒకప్పుడు తెలంగాణ అంటేనే కరువు.. రైతు ఆత్మహత్యలు.. వలసలకు కేరాఫ్ అడ్రస్. అలాంటి తెలంగాణ రూపురేఖలు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో పూర్తిగా మారిపోయాయి. నేడు చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. ఇదంతా కాళేశ్వరం పుణ్యం కాదా! తెలంగాణలో నేటికీ మెజారిటీ ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయానికి మూలమైన నీటి కోసం ఒక భారీ ప్రాజెక్టు నిర్మించడం తప్పా? అయినా తెలంగాణ ఉద్యమ నేపథ్యమే నీళ్లు, నిధులు, నియామకాలు. ఈ నీళ్ల సమస్య స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి తెలంగాణకు జీవన్మరణ సమస్యలా తయారైంది. అలాంటి సమస్యను కేసీఆర్ తరిమికొట్టారు. తెలంగాణ ఏర్పాటుతో మన నిధులు మనకు దక్కాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో నీళ్లూ దక్కాయి. అయితే, ఈ ప్రాజెక్టుపై మొదటినుంచీ కొందరు విష ప్రచారం చేస్తుండటం హేయం. సాధారణంగా నీరు ఎక్కువగా ఎక్కడైతే లభ్యమవుతుందో అక్కడే ప్రాజెక్టులు నిర్మిస్తారు. నది జన్మస్థానం నుంచి ఎంత కిందికి వెళ్తే అంత నీటి లభ్యత ఉంటుందనేది జగమెరిగిన సత్యం. జన్మస్థానం నుంచి నది కిందికి పయనించే కొద్దీ ప్రవాహ మార్గంలో ఉపనదులు, వాగులు, వంకలు, కాలువలు, పాయలు కలుస్తుంటాయి. అందుకే డిజైన్‌ను మార్చి, ప్రస్తుత ప్రాంతంలో ప్రాజెక్టును కట్టాల్సి వచ్చింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు కాస్ట్ బెనిఫిట్ రేషియో గురించి చూద్దాం. ఈ కాస్ట్ బెనిఫిట్ రేషియోను అసలు ఎలా చూడాలి? అసలు ఏ రంగంలో చూడాలి? మానవాళికి తాగునీరు అందించే విషయంలో చూడాలా? లేదా మానవ మనుగడకు అవసరమైన ఆహారాన్ని అందించే వ్యవసాయరంగానికి కావలసిన నీళ్లను ఇవ్వడంలో చూడాలా? పారిశ్రామికరంగానికి నీళ్లను అందించి, ఉద్యోగాలు కల్పించినందుకు చూడాలా? అసలు ఏ రంగంలో చూడాలి? ఈ విషయమై మేధావులకు అవగాహన లేకపోతే ఎలా? ఇంకా నేడు కొంతమంది కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారు. అదేమిటంటే.. ఒకవేళ కాళేశ్వరం ప్రాజెక్టు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చినట్టయితే నేడు పంపుసెట్లు ఎందుకు పెరిగాయని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో పంపుసెట్లు గతంలో కంటే పెరిగాయనేది వాస్తవం. దానికి ప్రధాన కారణం భూగర్భజలాల పెరుగుదల, నాణ్యమైన విద్యుత్తు సరఫరా. భూగర్భజలాలు పెరగడానికి ప్రధాన కారణం కాళేశ్వరం. మరొక ప్రశ్న ఏమంటే.. గత ఖరీఫ్ సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు వాడకపోయినా రికార్డు స్థాయిలో వడ్లు పండాయని చెప్తున్నారు. అదే రికార్డు పంట గత రబీ సీజన్‌లో ఎందుకు పండలేదు. ఎందుకంటే, కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను ఖరీఫ్ కంటే రబీ సీజన్‌లో ఎక్కువగా వాడుతాం. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే.. ఖరీఫ్‌లో వరి మాత్రమే ఎక్కువగా పండిస్తాం. అదే రబీ సీజన్‌లో వరితో పాటు అన్ని రకాల పంటలు పండిస్తాం. ఈ వాస్తవాలను గ్రహించాలి. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, మేధావులు కాళేశ్వరం ప్రాజెక్టు మీద అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలి. అర్ధసత్యాలు వల్లె వేయడం మాని కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు సమాయత్తం కావాలి. అప్పుడే తెలంగాణ రైతాంగానికి భవిష్యత్తు ఉంటుంది.

## కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

### ఇద్దరు పిల్లలకు ఉరేసి..తండ్రి ఆత్మహత్య

సంగారెడ్డి : క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగు తున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎండల తీవ్రతతో తగ్గిన కూరగాయల సాగు


### కూరగాయల ధరల్లో పెరుగుదల



హైదరాబాద్ : మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీనికితోడు దిగుబడులు కూడా తగ్గాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.. అకాల వర్షాల వల్ల కూరగాయల దిగుబడి తగ్గింది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. అకాల వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. బీర కిలో రూ.80కి పెరిగిపోయింది. అది రిటేల్ మార్కెట్లో వంద వరకు అమ్ముతున్నారు. అంటే రెట్టింపుయింది. బెండ కిలో రూ.రూ.60కి పెరిగింది. అది రిటేల్‌లో 20కి పావు కిలో అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలుదాదాపు రెండు రెట్లు పెరిగింది. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో అకాల వర్షాలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు.

## మంచివారితోనే స్నేహం మంచిది !

తిరుమల : మంచి వ్యక్తులతో స్నేహం... ఎప్పుడూ సత్యమే పలికేలా చేస్తుంది. బుద్ధి మాంద్యాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని పెంచుతుంది. సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుంది. కల్మషాలను పోగొడుతుంది. మనసును నిర్మలంగా ఉంచుతుంది. పేరు ప్రతిష్టలు పెరిగేలా చేస్తుంది. మనోవికాసాన్ని కలిగిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే... సజ్జనులైన వారి సాంగత్యం సకలార్థ సాధనం అని పెద్దలు చెబుతారు. అలా ప్రతి ఒక్కరిని ప్రేమించగలగాలి. ప్రేమ అంటే ఇరువురు స్త్రీ పురుషుల మధ్య ఉండేదేనా, ఉద్భవించేదేనా? కాదు. ప్రేమకు పరిమితి లేదు. హద్దుల్లేవు. గోడలు, పై కప్పు, తలుపులు, తాళాలు... ఏమీ లేవు. స్వేచ్ఛగా, ఎప్పటికీ రెక్కలు తెగని పక్షిలా దిగంతాలకు, అనంతాలకు ఎగిరిపోయే ఒక అమృత కెరటం. అయితే అది అపురూపమైనదే గానీ ఎవరికీ అందుబాటులోకి రానిది మాత్రం కాదు. దాన్ని అందరూ అనుభవించవచ్చు. అనుభూతించవచ్చు. అదే దాని ప్రత్యేకత. నిజానికి ఈ లోకం ఇంత సజావుగా నడుస్తోందంటే దానికి కారణం, మూలం... ప్రేమే. ప్రేమ... భగవంతుడి ప్రతిరూపమే. ఆయన కల్యాణ గుణమేఇంత అద్భుతమైన ప్రేమను నిత్యజీవితంలో అనుభవిస్తున్న లోకం ఎంతో ఆనందంలో ఓలలాడాలి కదా... మరి ఈ దుఃఖం ఏమిటి, ఈ విషాదం ఏమిటి? మనుషుల్లోని స్వార్థం, మూర్ఖత్వం, దురాశ... ఈ దుర్గుణాలవల్ల వంచనకు గురవుతున్నామన్న సత్యం అమాయకులమైన మనకర్థం కాదు. అర్థమయ్యేసరికి మన జీవితమే ముగిసిపోతుంది.



ఆధ్యాత్మికం

# దృష్టి లోపం ఉన్న వారికి కూడా మేలైన బ్యాంకింగ్ సేవలు..

### బ్రెయిలీ డెబిట్ కార్డు లాంచ్ ద్వారా ఆ సమస్యలు దూరం




భారతదేశంలో ఇటీవల కాలంలో బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని బ్యాంకు ఖాతాల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ముఖ్యంగా జన్-ధన్-ఖాతాలు భారతదేశంలో బ్యాంకింగ్ విప్లవాన్నే సృష్టించాయని చెప్పాలి. భారతదేశ పౌరులందరికీ జీరో బ్యాలెన్స్ అకౌంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అన్ని బ్యాంకులు అందించాయి. ముఖ్యంగా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెరిగాయి. డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారు ఇటీవల కాలంలో బాగా పెరిగారు. అయితే దృష్టి లోపం ఉన్న వారు బ్యాంకింగ్ సేవలను పొందడంలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వారికంటూ ప్రత్యేక చర్యలు ఏవీ లేకపోవడంతో వారు ఇంకా నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో దృష్టి లోపం ఉన్న వారికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. బ్రెయిలీ డెబిట్ కార్డులను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలుసుకుందాం. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం పీఎన్‌బీ అంత: దృష్టి పేరులో బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రారంభించింది. ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) డెబిట్ కార్డ్ రూపే నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉందని పీఎన్‌బీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రవేశపెట్టడం అనేది చేరిక, ఆర్థిక సౌలభ్యంపై పీఎన్‌బీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకు పీఎన్‌బీ ఇలాంటి చర్యలను తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే పీఎన్‌బీ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం అభినందనీయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని వివరిస్తున్నారు.

## యూపీఐ నగదు చెల్లింపుల్లో ఆ తప్పు చేశారా..? ఈ టిప్స్ పాటిస్తే మీ సొమ్ము వాపస్




భారతదేశంలో 2016లో నోట్లను రద్దు చేశాక ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందు కున్నాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఐ పేమెంట్స్ సదుపాయం ద్వారా చాలా మంది నగదును ఈజీగా బదిలీ చేస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ చెల్లింపుల వల్ల దేశంలో చిల్లర సమస్యకు చెక్ పడినట్లు అయ్యింది. అలాగే వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లకు నగదు బదిలీ కూడా బ్యాంకునకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులు ద్వారా చేయడం ప్రజలకు అలవాటు అయ్యింది. అయితే యూపీఐ ద్వారా ఒక వ్యక్తికి పంపబోయి వేరే వ్యక్తికి నగదును బదిలీ చేస్తే అవి తిరిగి రావు అని చాలా మంది చెబుతూ ఉంటారు. కానీ, నిర్దిష్ట విధానాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటున వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును వాపస్ పొందవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును ఎలా వాపసు పొందవచ్చో? ఓసారి తెలుసుకుందాం. యూపీఐ ద్వారా బదిలీ చేసిన నగదు వాపసు పొందడం ఇలా మీరు ముందుగా ఏ యాప్ ద్వారా నగదు బదిలీ చేశారో? ఆ యాప్‌లో లావాదేవీ నెంబర్ ద్వారా టిక్కెట్ రైజ్ చేసి కంప్లైంట్ చేయాలి. అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌ను సందర్శించి, 'వివాద పరిష్కార యంత్రాంగం' విభాగాన్ని సెలెక్ట్ చేసి ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలి. లావాదేవీ ఐడీ, వర్చువల్ చెల్లింపు చిరునామా, బదిలీ చేసిన మొత్తం, లావాదేవీ తేదీ, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో సహా అవసరమైన వివరాలను అందించాలి. అనంతరం అకౌంట్‌లో సొమ్ము బదిలీ జరిగినట్లు మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాలి. అక్కడ మీ ఫిర్యాదుకు కారణం 'మరో ఖాతాకు తప్పుగా బదిలీ చేయబడింది' ఎంచుకోవాలి. అనంతరం మీ ఫిర్యాదు పరిష్కారమవుతుంది. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ముందుగా టీపీఏపీ, తర్వాత పీఎస్‌పీ బ్యాంక్ (చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్ బ్యాంక్), అనంతరం బ్యాంకును సమస్య పరిష్కారం కోసం సంప్రదించాలి. ఒక నెల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే లేదా ప్రతిస్పందనతో మీరు అసంతృప్తి చెందితే, డిజిటల్ లావాదేవీల కోసం ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ని సంప్రదించాలి.

## ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితి పెంపు.. ఆ బ్యాంకుల్లో ప్రత్యేక ఆఫర్లు

భారతదేశంలో పెట్టుబడిదారులు నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటూ ఉంటారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఎఫ్‌డీల కంటే మంచి పెట్టుబడి ఎంపికలు ప్రజాదరణ పొందుతున్నాయి. క్రమేపి బ్యాంకుల్లో ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడానికి చాలా బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లను లాంచ్ చేస్తున్నాయి. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ ప్రత్యేక ఎఫ్‌డీలు అధిక వడ్డీను అందిస్తున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకులు అన్నీ ప్రత్యేక ఎఫ్‌డీల కాలపరిమితిని పెంచాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని పెంచాయో? ఓ సారి తెలుసుకుందాం. పొడగింపులను ప్రకటించిన బ్యాంకులు ఇవే ఇండియన్ బ్యాంక్ తన ప్రత్యేక ఎఫ్‌డీల కోసం పొడిగింపును ప్రకటించింది. ఎఫ్‌డీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ గడవు జూన్ 30తో ముగిసినా మరోసారి పెంచారు. ఐడీబీఐ బ్యాంక్‌కు సంబంధించిన ప్రత్యేక ఉత్సవ్ ఎఫ్‌డీల గడువు కూడా సెప్టెంబర్ 30, 2024 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ పథకం గడువు జూన్ 30, 2024న ముగిసినా వినియోగదారులను ఆకర్షించడానికి బ్యాంకు మరోసారి గడువును పొడగించింది. పంజాబ్ సింధ్ బ్యాంక్ లిమిటెడ్ పిరియడ్ ప్రత్యేక డిపాజిట్ల కాలపరిమితిని పెంచింది. ఈ గడువు సెప్టెంబర్ 30, 2024కి ముగుస్తుంది. ప్రముఖ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రత్యేక డిపాజిట్లపై కాలపరిమితిని పెంచింది. అమృత్ కలాష్ స్కీమ్, ఎస్‌బీఐ వీ కేర్ ఎఫ్‌డీల కాలపరిమితిని ఎస్‌బీఐ పెంచింది. ఎస్‌బీఐ కూడా ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని సెప్టెంబరు 30, 2024 వరకు పెంచింది.

# మోసగాళ్ల సీజన్ ఆగయా...

- పచ్చని భూముల్లో బీటీ-3 విషం ◆ హెచ్ టీబీటీతో నిస్సారమవుతున్న నేలలు
- బీటీ-3 విత్తనాలతో కేటుగాళ్ల దందా. ◆ కేజీ విత్తనాలు రూ. 2500 వరకు అమ్మకాలు
- కలుపు బాధ తప్పుతుందని ఆ విత్తనాల వైపు మొగ్గుచూపుతున్న రైతులు
- అధిక దిగుబడి వస్తుందని సేద్యం చేస్తున్న రైతులు ◆ మోసగాళ్లను వదిలేసి విత్తనషాపులపై రైడింగ్..!
- మోసగాళ్లకు సహకరిస్తున్నది ఇంటి దొంగలేనా..? ◆ ఇంత జరుగుతున్న వ్యవసాయ అధికారుల చర్యలేవీ?





**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి జూన్ 05, (హైదరాబాద్ న్యూస్):** హైదరాబాద్ న్యూస్ : రాష్ట్రంలో నిషేధిత బీటీ3 పత్తి విత్తనాల వాడకం ఏటా పెరుగుతున్నది. సైంటిఫిక్గా హెచ్ఐబీటీ (హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ) గా పిలిచే ఈ బోల్గార్డ్ విత్తనాలు ఇప్పటికే ఊరూరూ చేరుకున్నాయి. రుతుపవనాలు రానే వచ్చే.. తొలకరి జల్లులతో రైతులు వ్యవసాయం చేసేందుకు దుక్కులు రెడీ చేసుకుంటున్నారు. రైతన్నలు దుక్కి దున్ని విత్తనాలు నాటుకునేందుకు ! సిద్ధమైతుండ్రు... నకిలీ విత్తనాలు అమ్మేందుకు నకిలీ గాళ్లు... కొంతమంది అధికారులు.. నాయకుల అండదండలతో.. మార్కెట్లో కాసుకొని కూర్చుండు ఇదే విత్తన మోసగాళ్ల సీజన్. నకిలీ విత్తనాలను అమ్మే మోసగాళ్లను వదిలేసి అన్ని ప్రభుత్వ అనుమతులు పొంది వ్యాపారం నిర్వహిస్తున్న ఎరువుల వ్యాపారాలపై అధికారులు తనిఖీలు చేపడుతూ వ్యాపారులను వేధిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి నకిలీ విత్తనా మోసగాళ్లకు జిల్లా లోని ఇంటి దొంగలు సహకరిస్తున్నారని తెలుస్తుంది,

రాత్రి వేళల్లో సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర మరియు ఏపీలోని గుంటూరు, నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గ్రామాల్లో విత్తన మోసగాళ్లు ఆయా గ్రామాల్లో డంపు చేసి అమాయక రైతులకు బీటీ3 క్యాన్సర్ కారక విత్తనాలు మోసపూరిత వాగ్దానాలతో అంటగడుతున్నారు. భూపాలపల్లి జిల్లాలోని మారుమూల గ్రామాల రైతులు విత్తన మోసగాళ్లు చెప్పే మాటలకు మోసపోయి బీటీ3 పత్తి విత్తనాలతో వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడి వస్తుందని మాయమాటలు చెప్పి విత్తన మోసగాళ్లు అమాయక రైతులకు క్యాన్సర్ కారకమైన పత్తి విత్తనాలను అంటగడుతున్నారు. ప్రతి ఏటా ఇదే సమయానికి ఏపీ నుంచి బీటీ3 పత్తి విత్తన మోసగాళ్లు భూపాలపల్లి జిల్లానే ఫోకస్ పెట్టి మరి విక్రయాలు జరుగుతుండడం గమనార్హం. ఈ విషయం జిల్లా అధికారుల అందరికీ తెలిసినా.. దందా పరిపాటిగా సాగుతోంది.

### బిటి -3 ధర 1500 నుండి 2500 వరకు ఒక్క కేజీ ప్యాకెట్..

ఏపీ నుంచి తీసుకువచ్చిన బీటీ3 పత్తి విత్తనాలు ఒక్కో కేజీ రూ.1500 నుంచి రూ.2500 వరకు విక్రయిస్తున్నారు. అదే బీటీ 2 విత్తనాలు మంచి బ్రాండ్ ఉన్న కంపెనీలు 450 గ్రా, అయితే రూ.750 నుంచి రూ.900 వరకే లభ్యమవుతాయి. వ్యవసాయం చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆలోచన చేసే రైతులు ఈ విత్తన మోసగాళ్లు చెప్పే మాటలకు మోసపోయిన వారి నుంచి విత్తనాలను కొనుగోలు చేసి వ్యవసాయం బీటీ 3 పత్తి విత్తనాలతో సేద్యం చేస్తున్నారు.. గత 10 రోజులుగా ప్రత్యేకమైన కార్లలో తీసుకొచ్చి ఈ గ్రామాల్లోని రైతులకు అంట గడుతున్నట్లు సమాచారం.

### ఏంటీ హెచ్ టీబీటీ..?

పత్తిలో శనగ పచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, గులాబీ రంగు పురుగును నివారించేందుకు అమెరికాకు చెందిన మోన్ శాంటో కంపెనీ బీటీ టెక్నాలజీని డెవలప్చేసింది. నేలలో ఉండే బాసిల్లస్ తురింజియెన్సిస్ (బీటీ) అనే బ్యాక్టీరియాలోని జన్యువులను విత్తనాల్లోకి జొప్పిస్తారు. ఈ జన్యువుల్లోని ప్రొటీన్లు సహజంగానే కీటకాలపై విషంలా పనిచేస్తాయి. ప్రారంభంలో పత్తిని ఆశించే పురుగులపై హెచ్ఐబీటీ టెక్నాలజీ సక్సెస్ అయ్యింది. 2002లో బీటీ-1 పత్తి విత్తనాలు దేశంలో ప్రవేశించగా, 2006 దాకా అన్ని రకాల పురుగులను ఎదుర్కొన్నాయి. క్రమేణా బీటీ-1 టెక్నాలజీ గులాబీ రంగు పురుగును నాశనం చేసే శక్తిని కోల్పోయింది. దాని స్థానంలో మోన్శాంటో బీటీ-2 టెక్నాలజీని తీసుకొచ్చింది. 2012 నాటికి గులాబీ రంగు పురుగు దీన్నీ తట్టుకుని మొండిగా తయారైంది. దీంతో పురుగులతోపాటు గ్లైఫోసేట్ లాంటి కలుపు మందును కూడా తట్టుకునేలా మోన్శాంటో కంపెనీ బీటీ-3 గా చెప్పుకునే హెచ్ఐబీటీ టెక్నాలజీ తీసుకొచ్చింది. దాని వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుందని తేలడంతో మన దేశంలో కేంద్రం పర్మిషన్ ఇవ్వలేదు. కానీ ఇండియా లాంటి మార్కెట్ను వదులుకోవడం ఇష్టం లేని మోన్శాంటో ప్రయోగాల కోసం అనుమతి పొంది దేశంలో ప్రవేశించింది. తర్వాత దేశీయ కంపెనీలు, వాటి నుంచి చిన్న ఉత్పత్తి, రవాణా మొదలుపెట్టాయి. ఏజెంట్లను పెట్టుకొని అక్రమ మార్గాల్లో రైతులకు చేరవేస్తున్నాయి.

### గడ్డి మందే యమ డేంజర్

అమెరికాలో వ్యవసాయ కూలీల కొరత వల్ల పత్తి, మక్క, సోయాబిన్ పంటల్లో కలుపు నివారణకు బీటీ-3 టెక్నాలజీ వాడుతున్నారు. హెచ్ఐబీటీ పంటల్లో గ్లైఫోసేట్ పిచికారీ చేస్తే ప్రధాన పంట తప్ప మిగిలిన మొక్కలన్నీ నశిస్తాయి. గ్లైఫోసేట్ 150 కన్నా ఎక్కువ గడ్డి జాతులను, మొక్కలను నాశనం చేస్తుందని, తద్వారా జీవవైవిధ్యం దెబ్బతింటోందని పలు స్టడీల్లో తేలింది. బీటీ 3 విత్తనాల్లో గ్లైఫోసేటు తట్టుకునే జన్యువులను చొప్పించడంతో మొక్కలు విషపూరితమవుతాయి. చిన్న కమతాల్లో గ్లైఫోసేట్ వాడితే పక్క భూమిలో సాగుచేస్తున్న ఇతర పంటలు దెబ్బతినే ప్రమాదముంది. మోతాదుకు మించి స్ప్రే చేస్తుండడం వల్ల వీటి అవశేషాలు భూమిలోనే ఉండిపోతున్నాయి.

### బిటి - 3 తో భూమి మరియు మానవాళిపై ప్రభావం

ఈ రసాయనాలకు ఇంకే గుణం ఉండడంతో భూగర్భజలాలు విషతుల్యం అవుతున్నాయి.

అజాగ్రత్త వల్ల రైతులు క్యాన్సర్లు, నరాల జబ్బులు, కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని స్టడీస్ చెప్తున్నాయి. పత్తి నుంచి పక్కనే ఉన్న ఇతర పంటల్లోకి, అక్కడి నుంచి ఆహార పదార్థాల్లోకి, ఆఖరికి రోడ్ సైడ్ ఫుడ్ స్టాల్స్‌ని ఆహార నమూనాల్లోనూ గ్లైఫోసేట్ జాడలున్నాయని పలు స్టడీలు వెల్లడించాయి. ఈ విత్తనాల వల్ల తాము, తమ వాళ్లు క్యాన్సర్ బారిన పడ్డామని అమెరికాలో మోన్శాంటో కంపెనీపై 300కిపైగా దావాలు నడుస్తున్నాయి.

### పర్యావరణ పరిరక్షణ చట్టం%-% 1986 ప్రకారం

మార్కెట్లో 450 గ్రాముల బీటీ 2 ప్యాకెట్లేటు రూ.901 ప్యాకెట్లను చొప్పున విక్రయిస్తున్నారు. బిటి -3 లూజ్ విత్తనాలైతే కిలోకు రూ.1,800 నుంచి రూ.2,500కే ఇస్తున్నారు. ఈ సీడ్స్ సరఫరా చేస్తూ పట్టుబడితే పర్యావరణ పరిరక్షణ చట్టం%-% 1986 ప్రకారం ఏడేండ్ల జైలుశిక్షతో పాటు రూ.లక్ష దాకా జరిమానా విధించవచ్చు.

నకిలీ విత్తన కేటుగాళ్లకు అధికారంలో ఉన్న పెద్దల అండదండలు ఉండడం, గ్రామాల్లో ఏజెంట్లుగా ఎక్కువ మంది రూలింగ్ పార్టీ లీడర్లే చక్రం తిప్పుతుండడంతో ఆఫీసర్లు చర్యలకు వెనుకాడుతున్నారు. జిల్లాల్లో అగ్రికల్చర్ ఆఫీసర్లు, పోలీసులతో కూడిన టాస్క్ ఫోర్స్లను వేసినా పోలీసులే అడపాదడపా బీటీ3 విత్తనాలను పట్టుకుంటున్నారు. గత సీజన్లో భూపాలపల్లి జిల్లాల్లో 30 శాతానికి పైగా బీటీ-3 రకమే సాగైంది. ఈ సారి సాగు విస్తీర్ణం 50 శాతానికి చేరవచ్చనే అంచనా ఉంది.

### దొంగ చాటున జిల్లాల్లోకి...

దొంగచాటుగా వస్తున్న విత్తనాలన్నీ ఇల్లీగల్ కావడంతో పంట నష్టపోయినప్పుడు రైతులకు పరిహారం అందడం లేదు. కొన్ని చోట్ల హెచ్ఐటీబీటీ పేరుతో నాన్బీటీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. నాన్బీటీ పంటలపై గ్లైఫోసేట్ స్ప్రే చేసినప్పుడు ప పంట ఎండిపోయి, రైతులు నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

### హెచ్ఐబీటీ విత్తనాల వల్ల గులాబీ రంగు పురుగు

హెచ్ఐబీటీ విత్తనాల వల్ల మన దగ్గర గులాబీ రంగు పురుగు మరింత రోగనిరోధకశక్తిని పెంచుకుందని అగ్రికల్చర్ సైంటిస్టులు అంటున్నారు. గులాబీ రంగు పురుగు ఉధృతి తీవ్రమై పంట నష్టం జరుగుతున్నదని చెప్తున్నారు. దీంతో రైతులు మళ్లీ మళ్లీ పురుగుల మందులు స్ప్రే చేస్తున్నారని, ఫలితంగా పెట్టుబడులు పెరగడంతోపాటు పర్యావరణానికి, రైతుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని హెచ్చరిస్తున్నారు.

### బిటి -3 ఎకరం దిగబడి

హెచ్ఐబీటీ విత్తనాల వల్ల పత్తి దిగుబడులు తగ్గుతున్నాయి. మొదట్లో ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పినా.. ప్రస్తుతం 7 క్వింటాళ్లకు మించట్లేదు. గతేడాది ఎకరాకు 2.5 %-%3.5 క్వింటాళ్ల దిగు వచ్చింది. రైతులకు అన్ని విధాలా నష్టం

గ్లైఫోసేట్ ఎక్కువ సార్లు పిచికారీ చేస్తుండడంతో నేలలో ఉండే మిత్రపురుగులు, వానపాములు నశించి భూమి గుల్ల బారే ప్రక్రియ నిలిచిపోతున్నది. పొడిగా ఉండాల్సిన నేల గట్టి కేకులా తయారవుతున్నదని, ఆ భూముల్లో ఇతర పంటలేవీ పండని స్థాయిలో నిస్సారమవుతున్నాయని నిపుణులు అంటున్నారు.

### అధికారుల చర్యలేవి?

ప్రస్తుతం రాష్ట్రంలో బీటీ-2 పత్తి విత్తనాలు మాత్రమే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఈ ప్రాంత గ్రామాల్లో మాత్రం ఇందుకు విరుద్ధంగా రైతులను మోసగించి మోసగాళ్లు బీటీ-3 విత్తనాలను అంటగడుతున్నారు. దీంతో వ్యవసాయం చేసే రైతు కుటుంబాలు, కూలీ పనులకు వెళ్లే వారి కుటుంబాలు సైతం క్యాన్సర్ కారకానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. మొక్క మొలసినప్పుడు, పూత దశ వచ్చినప్పుడు, ఖాతా దశలో, పత్తి పూర్తిస్థాయిలో తయారైన తర్వాత తీసే దశలోనూ వచ్చే పరిమళంతో వ్యవసాయ పనులు చేసే వారందరికీ క్యాన్సర్ సోకే అవకాశాలు ఉన్నాయని నిపుణులు నిర్ధారించి హెచ్చరికలు సైతం జారీ చేశారు. వ్యవసాయ అధికారుల కనుసన్నల్లోంచే ఈ విత్తన దందా మహారాష్ట్ర ఏపీ నుంచి అక్రమంగా కేటుగాళు బీటీ-3 విత్తనాలను ఇక్కడి రైతులకు అంటగడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



# సింగరేణి వైద్యాధికారికి ఏఐటియుసి మెమోరాండం

**యైటింక్లయిన్ కాలని.:** స్థానిక సెక్టర్.3 సింగరేణి డిస్పెన్సరీ లో నెలకొన్న సమస్యలపై, ఆదివారం సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిస్పెన్సరీ డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ మహిపాల్ కు మెమోరాండం అందించారు. సాయంత్రం డిస్పెన్సరీకి వచ్చిన నాయకులు డివై సీఎంఓ ను కలిసి మెమొరాండం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. డిస్పెన్సరీ లో మందుల కొరతతో పాటు, వైద్యులు అందుబాటులో లేక కార్మికులు, కార్మిక కుటుంబాలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కార్మికులకు అవసరమైన మందులు బి కాంప్లెక్స్, ప్యారచ్యుట్ మాల్, బిపి, షుగర్ లాంటి దీర్ఘ కాలిక మందులు కూడా అందుబాటులో లేకున్నాయన్నారు. అంతేకాకుండా పార మెడికల్ సిబ్బంది, డాక్టర్స్ కూడా అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. వెంటనే వైద్యులు, అవసరమగు మందులు అందుబాటులో ఉంచాలని లేని పక్షంలో, కార్మికుల సహకారంతో పోరాటాలు చేపడతామని, ఇందుకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్. ప్రకాష్, జిగురు రవీందర్, బుర్ర తిరుపతి, కొండ్ర సత్యనారాయణ, కుంట తిరుపతి, శంకర్, మహేందర్, సాంబశివరావు, రాజ్ కుమార్, కృష్ణ, కుమార్, ఆంజనేయులు, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం


**యైటింక్లయిన్ కాలని. :** స్థానిక సింగరేణి సి.ఈ.ఆర్ క్లబ్ లో ఆదివారం రామగుండం రెండవ ఏరియా ఓసిపి.త్రీ ప్రాజెక్టులో ఈపి ఫిట్టర్ గా విధులను నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన హార్మోనిస్టు, గాయకులు జెట్టి. మల్లేశ్వరరావు దంపతులను ఏరియా కళాకారులు ఆత్మీయంగా సన్మానించారు. ఉదయం ఏరియా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న తోటి కళాకారులు మల్లీశ్వరరావు దంపతులను శాలువాలు పూలమాలలతో ఆత్మీయంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం పలువురు కళాకారులు మాట్లాడుతూ..మల్లేశ్వరరావు కీబోర్డు ప్లేయర్ గా, హార్మోనిస్టుగా సింగరేణి జయంతి వేడుకలు, తెలంగాణ ఆవిర్భావ వేడుకలు, రక్షణ నాటికలు, సింగరేణి అంతర్గత సాంస్కృతిక పోటీల్లో పాల్గొని, గత 25 సంవత్సరాలుగా కళారంగంలో రాణిస్తూ, ఉత్తమ కళాకారునిగా పేరుగాంచారని కొనియాడారు. అలాగే సింగరేణి లో ఫిట్టర్ గా విధులు నిర్వహిస్తూ, 38 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు సంస్థకు సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కనకం రమణయ్య, ఉపాధ్యక్షులు సయ్యద్ హమీద్, ప్రధాన కార్యదర్శి బొంబకు రాకేష్, సహాయ కార్యదర్శి బోయిని రాజారాం, కోశాధికారి గీసల రామారావు, ప్రచార కార్యదర్శి తాళ్లపల్లి నారాయణ, సహాయ కార్యదర్శులు కోల కృష్ణస్వామి, గద్దల నరసింహ, క్లబ్ సెక్రటరీ పిడుగు రమేష్, జిమ్ ఇన్చార్జి ఆకుల సూరయ్య, డాన్స్ మాస్టర్ ప్రశాంత్, చిన్నారి, మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు కళాకారులు పాల్గొన్నారు.



# రైతుకు రైతే మొదటి శత్రువు

- పల్లెల్లో చొచ్చుకొస్తున్న బి.టి.3 పత్తి విత్తనాలు - ఎక్కువ దిగుబడే లక్ష్యం
- పంట పండడమే ముఖ్యం - పర్యవసానాలతో పనిలేదు
- సాటి రైతుల మాటల్ని నమ్మడమే - పత్తి గింజలతో రానున్న విపత్తు
- పల్లెలకు చేరిన ప్రమాదకర విత్తనం - నిఘా లేదు పాడు లేదు... ఒక్కడి మీద కేసు లేదు
- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం
- గుట్టు చప్పుడు కాకుండా వ్యవసాయ క్షేత్రాలకు చేరుకున్న అత్యంత ప్రమాదకర బిటి3 పత్తి విత్తనాలపై ప్రత్యేక కథనం పాఠకుల కోసం....




**(హైదరాబాద్ ) బ్యూరో:** ఎడ్లతో గుంటుక కట్టి ఇడుగు ఇరువాలు కలెదున్ని కలుపు లేకుండా పంటలు పండించే రోజులు పోయాయి. పూర్తిగా కలుపు మందుల మీదనే ఆధారపడి సాగుతున్నది నేటి వ్యవసాయం. భవిష్యత్తు గురించి ఆసాములు ఎవరూ పట్టించుకోవడం లేదు. విచ్చలవిడిగా రసాయన ఎరువులతో పాటు కలుపు మందులు క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తూ కేవలం దిగుబడి మీదనే దృష్టి పెడుతున్నారు తప్ప చేసే పనుల వల్ల రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. అధిక దిగుబడిని ఇచ్చే రకాల వేటలో విచక్షణను కోల్పోతున్నారు. అందరికన్నా ఎక్కువ దిగుబడి వస్తే చాలు అనే ధోరణి రోజురోజుకు పెరిగిపోతున్నది. ఆ క్రమంలోనే నేడు పల్లెల్లోకి అతి ప్రమాదకర బిటి3 పత్తి విత్తనం చేరి భస్మాసురుడి వలె ఆదరించినోడినే అంతంచేయ చూస్తున్నది. వ్యవసాయంలో పోటీతత్వం విపరీతంగా పెరిగిపోయింది. పోటీ ఉంటేనే కదా పోటా పోటీగా దిగుబడి పెరిగేది అందులో తప్పేముంది అని ఎవరైనా అనడంలో తప్పులేదు. ఈ పోటీ తత్వమే ఇప్పుడు రైతు పాలిట శాపంగా మారనున్నది. ఈ పోటీ వల్ల రానున్న కొద్ది రోజుల్లోనే వ్యవసాయ భూములు ఎందుకు పనికి రాకుండా పోయే ప్రమాదకర ఘడియలు కొద్ది దూరంలోనే ఉన్నాయి. పనిలో పోటీ పడడం మానేసి కేవలం రసాయన ఎరువులను చల్లడంలోనే తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. పక్కనున్నోడు రెండు బస్తాలు వేస్తే నేను మూడేస్తా అంటూ అడ్డు అదుపు లేకుండా రసాయనక ఎరువులను క్రిమిసంహారక మందులను కలుపు మందులను చల్లుతున్నారు. ఈ సంగతి అలా ఉంచితే ఇక విత్తనాల విషయంలో కూడా ఈ పోటీ తత్వం వల్ల తనకు తెలియకుండానే రైతు తన గోతిని తానే తవ్వుకుంటున్నాడు. అది అజ్ఞానమో లేక అవివేకమో లేక తెలిసి కూడా చేస్తున్నాడో తెలియదు గానీ వద్దురా నాయినా అది అశిద్ధం అంటే దాన్నే అద్దుకొని తింటా అన్నట్టు చేస్తున్నరు కొందరు రైతులు. గ్లైఫోసిట్ ( గ్లైసిల్ ) అనే కలుపు మందు అత్యంత ప్రమాదకారిగా మారడంతో ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిషేధించింది. అయినా నేటికీ రైతులు దొంగ చాటుగా గుర్తు చప్పుడు కాకుండా వాడుతూనే ఉన్నారు. ఇప్పుడు బీటీ 3 పత్తి విత్తనాల వల్ల అంతకంటే ఎక్కువ ప్రమాదం రైతులకే కలగనున్నదని చెప్పినా కూడా వినకుండా దాని వైపే మొగ్గుచూపుతున్నారు. సాటి రైతులు చెప్పిన ముచ్చట్లే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. తొలకరి పలకరించి దాదాపు 15 రోజులు గడిచింది. అప్పటికే ఈ విత్తనాలు పల్లెల్లోకి చేరిపోయాయి. అంటే మన నిఘా వ్యవస్థ ఎంత పకడ్ బందీగా కాపలా కాస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంలో పోలీసులు, ఇంటలిజెన్స్, వ్యవసాయ శాఖ అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనబడుతున్నది. ఒకరికొకరికి సమన్వయం లేకపోవడంతో విచ్చలవిడిగా ఈ రకం పత్తి విత్తనాలు ప్రతి పల్లెకు చేరాయి. పంట పండితే రైతు ఆనందంగా బతకాలి గాని, రైతునే వల్ల కాడికి పంపే వంగడాలు ఎందుకు? అంటూ కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రమాదకర విత్తనాలపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని రైతు లోకం కోరుతున్నది.

# నూతన మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన అడ్లూరిని కలిసిన శ్రేణులు



**ధర్మపురి,:** మంత్రివర్గ విస్తరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించి ప్రమాణస్వీకారం చేశారు. కాగా ఉమ్మడి వెల్గటూర్ మండలాల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి ఆధ్వర్యంలో మినిస్టర్ క్వార్టస్ లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మద్దుల గోపాల్ రెడ్డి, ఛైర్మన్ గుండేటి గోపిక- జితేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గోళ్ళ తిరుపతి, రాంరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మురళి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ మేరా దోస్త్..! 25 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు




**రామగిరి జూన్ 08:** పదవ తరగతి పూర్తి చేసుకుని 25 సంవత్సరాలు గడిచిన తర్వాత పుర్వ విద్యార్థులంతా ఒక దగ్గర కలుసుకోవడం ఆనందంగా ఉందని విద్యా భారతి ఉన్నత పాఠశాలలో చదివిన 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని విద్యా భారతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నికి ముఖ్యఅతిథిగా విద్యా భారతి కరస్పాండెంట్ కేశెట్టి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గంట పద్మ తో పాటు పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొని చిన్ననాటి గుర్తులను గుర్తు చేసుకొని సంబరాలు చేసుకోవడం జరిగింది. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదిలో జరిగిన స్మృతులను గుర్తు చేసుకొని ఉద్విగ్నతకు లోనయ్యారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థుల మంచి కోసమే పనిచేస్తారని ఒకప్పటి విద్యార్థులకు నేటి విద్యార్థులకు ఉన్న వ్యత్యాసాన్ని ఉపాధ్యాయులు తెలియజేశారు. టెక్నాలజీ వ్యవస్థ పెరగడంతో కొంతమంది విద్యార్థులు చెడు వైపు ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొట్టే రాజేందర్, పూరెల్ల రాజేందర్, మంద ప్రభాకర్, కన్నూరి సంపత్, బొబ్బిలి మోహన్, కాట స్వప్న, పాత మాధవి, బొడిగ రజిత, చిట్టెంపెల్లి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల్లో పాముల సయ్యాట

- సెంటనరీ కాలనీ సింగరేణి పార్కులో విష పాములు
- పట్టించుకోని సింగరేణి ఫారెస్ట్ అధికారులు





**రామగిరి, జూన్ 08:-** రెండు నాగుపాములు ఒక్కదానికొకటి చుట్టుకుని సుమారు గంట పాటు నాట్యం చేసిన దృశ్యం సెంటనరీ కాలనీలోని సింగరేణి కంపెనీ పార్క్ లో కనిపించింది. రెండు పాములు మేళా వేసుకునీ నాట్యం చేస్తూ కనిపించాయి. ఆ దృశ్యాన్ని చూసి స్థానికులు భయపడ్డారు. చుట్టుపక్కల స్థానికులు దూరం నుండి పాముల నాట్యాన్ని చూసి తిలకించారు. సెల్ ఫోన్ లో వీడియోలు తీశారు. రెండు పాములు పడగలు విప్పి ఒకదానికొకటి మెలవేసుకునే దృశ్యం అందర్నీ ఆశ్చర్యపరిచాయి. చుట్టూ చాలామంది గుమీ గూడిన అవి వారిని పట్టించుకోకుండా గంటకు పైగా పెను వేసుకుంటూ రసకేళీ లో మునిగితేలాయి. పార్కుల్లో పాములు తిరుగుతున్నాయంటే అది ప్రజల భద్రతకు ముప్పు.పార్కుల్లో పాములు పట్టించుకోకపోవడం వలన ప్రజలకు భయం కలగవచ్చు, ప్రమాదాలు జరగవచ్చు.స్థానిక పార్క్ అధికారులకు తెలియజేసి ఈ సమస్యను పరిష్కరించడానికి సింగరేణి ఫారెస్ట్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మతిస్థిమితంలేని వృద్ధురాలి బలవన్మరణం



**మానకొండూర్, జూన్ 8,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారంలో తొరికొండ రాజవ్వ (76)అనే మతిస్థిమితం లేని వృద్ధురాలు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డట్లు స్థానిక సిఐ బి.సంజీవ్ తెలిపారు.గత నాలుగు సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోవడంతో ఆసుపత్రిలో చూపెడుతున్నప్పటికి వ్యాది నయం కాక ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో లోని వ్యవసాయ భావిలో దూకి మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు ఉండగా రెండవ కుమార్తె సముద్రాల రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## జంగ్ సైరన్ మోగించిన కేటీఆర్ సేన

### - ఓదెల మండల అధ్యక్షుని నియామకం
### - మద్దెల శ్రీనివాస్‌కు పగ్గాలు



**(హైదరాబాద్ ) బ్యూరో: జూన్8:** పెద్దపల్లి జిల్లాలో కేటీఆర్ సేన గ్రామ గ్రామాన విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఆ క్రమంలో ఈ రోజున ఓదెల మండలఅధ్యక్షున్ని నియమించి అధికార పక్షానికి సవాలు విసిరింది. రానున్న స్థానిక ఎన్నికల్లో బి ఆర్ ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కేటీఆర్ సేన జంగ్ సైరన్ మోగించినట్టే నన్న సంకేతాలు బలపడుతున్నాయి. ఈరోజుఓదెల మండల కేటీఆర్ సేన అధ్యక్షునిగా మద్దెల శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్టు జిల్లా అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇంత గొప్ప బాధ్యతను తనకు అప్పగించినందుకు జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ కు కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మేంగాని మనోహర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ అధికార పార్టీ ఇచ్చిన అడ్డగోలు హామీలపైన ఎప్పటికప్పుడు అధికారపక్ష నాయకులనునిలదీస్తూ ప్రజల పక్షాన పోరాటం చేయడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని, ప్రభుత్వ అసమర్ధ తీరును ఎండగడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ బి ఆర్ ఎస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఖండిస్తూ ప్రజా సమస్యల పైన రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు చేసే ప్రతి పోరాటాన్ని విజయవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. కెసిఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా కేటీఆర్ సేన పని చేస్తుందని అన్నారు.

## పోచంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**మానకొండూర్, జూన్ 8,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లిలో ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్ భూమి పూజ చేశారు. నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ఇళ్ళ నిర్మాణాలకు రుణ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం అందిస్తున్నందున త్వరగా ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని దాసరి శ్రీనివాస్ యాదవ్ లబ్ధిదారులకు సూచించారు.కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వేముల జయరాజ్,రెడ్డి సంఘ అధ్యక్షుడు సురెందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోలం అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, మచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడ్మిషన్లు పారదర్శకంగా జరుగుతాయి

### సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జి. శ్రీనివాస్



**యైటింక్లయిన్ కాలని. :** స్థానిక సెక్టార్.3 సింగరేణి ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభోత్సవ పనులను సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జి. శ్రీనివాస్ ఆదివారం పర్యవేక్షించారు. ఇక్కడికి వచ్చిన ఆయన ప్రారంభోత్సవ పనులను లను పర్యవేక్షించి, పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ లో అడ్మిషన్ల కొరకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్టులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. అడ్మిషన్ల విధానం పూర్తి పారధర్శకంగా ఉంటుందన్నారు. ఎలాంటి సిఫారసులకు, ఒత్తిళ్లకు తావులేకుండా, కేవలం విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే అడ్మిషన్లు జరుగుతాయన్నారు. (సింగరేణి, సింగరేణితర) పిల్లలకు 80:20 విధానం పాటించడం జరుగుతుందని సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత......ఇద్దరిపై కేసు నమోదు



**మానకొండూర్, జూన్ 8,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ వద్ద ఇసుక ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. రేణిగుంటకు చెందిన బోయిని చంద్రయ్య (47), నేదునూర్ కు చెందిన మంద శేఖర్ (23)అనే ఇద్దరు ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం రేణిగుంట వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా నల్లగొండ శివారులో ఇసుకతో సహ ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలుపుతూ ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్

### ◆ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో అంబరాన్ని అంటిన సంబరాలు





**ధర్మపురి, జూన్ 8, :** రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్ని అంటినట్లు నాయకులు వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కొత్తగా నియమితులైన ముగ్గురు మంత్రులతో రాజ్‌భవన్‌లో పదవీ స్వీకార ప్రమాణం చేయించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రులు గా ముగ్గురు అభ్యర్థులచే రాష్ట్ర గవర్నర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూర్, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి, వాకిటి శ్రీహరి గార్లతో మంత్రులుగా ప్రమాణం చేయించారు. నూతన మంత్రులకు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు పలువురు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ వేడుకల దృష్ట్యా ధర్మపురి నియోజకవర్గంని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర మంత్రివర్యులుగా ప్రమాణ స్వీకార చేసిన సందర్భంగా ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయంలో లక్ష్మణ్ కుమార్ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మండల నాయకులు పట్టణంలోని స్థానిక నంది విగ్రహం వద్ద టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టి మంత్రి లక్ష్మణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.



## రైతు నేల యొక్క పోషక సామర్థ్యాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి

### ◆ ఏ.ఈ.ఓ అయ్యోరి అజయ్ కుమార్



**ధర్మపురి, జూన్ 8, :** రైతు నేల యొక్క పోషక సామర్థ్యాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి అయ్యోరి అజయ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండలం లోని రాయపట్నం గ్రామంలో ఆదివారం అయ్యోరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. గ్రామ రైతులు భూసార పరీక్షలు గూర్చి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు మరియు మట్టి నమూనా ఎలా తీయాలో గ్రామ రైతులకు ప్రత్యక్షంగా చూపించడం జరిగిందని వ్యవసాయ విస్తరణ అధికారి అయ్యోరి అజయ్ కుమార్ తెలిపారు. భూమి యొక్క సారాన్ని పరీక్షించి తెలుసుకొనే పద్ధతిని భూసార పరీక్ష అంటారని ఆయన వివరించారు. పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు కొంత పరిమాణంలో నేలలో సహజంగా ఉంటాయని అయితే వీటిలో వ్యత్యా సాలు ఉండే అవకాశం ఉందని కావునా నేలలో పోషకాలు ఎంత లభ్యమవుతున్నాయో వేయదలచిన పైరుకు ఎంత ఎరువు అవసరమో నిర్ధారించి వాడాలని రైతులకు ప్రత్యేకంగా చూపించారు. కావున భూసారాన్ని పరీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భూమి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తూ మొక్క పెరుగుదలకు, దిగుబడిని అందించడంలో ప్రధాన పాత్ర వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతు నేల యొక్క పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం వలన ఏ నేలలో ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకొని మంచి దిగుబడులు ఇచ్చే పంటను పండించడానికి అవకాశం ఏర్పడుతుందని రైతులకు సూచించారు. వేసిన పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనపుడు భూసార పరీక్ష ద్వారా నేలలో ఏ పోషకాలు తగ్గినాయో ఆ పోషకాలను నేలకు అందించడం వలన పంట మంచి దిగుబడిని అందించడమే కాక నేలకు అందించే పోషకాల ఖర్చును బాగా తగ్గించుకోవచ్చుననీ తెలిపారు. భూసార పరీక్ష వలన నేలలో మొక్కకు కావాలసిన పోషక పదర్థాలు ఏయే పాళ్ళలో ఉన్నాయో తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. నేలలో ఉన్న నత్రజని, భాస్వరం, పొటాషియం మొదలైన పోషక పదార్థాలను మొక్కలు సేకరించటం వలన భూసారం తగ్గుతూ ఉంటుంది, అందువలన పంటను వేసే ముందే మట్టి నమూనా పరీక్షించటం ద్వారా ఆ నేలలో తగ్గిన పోషకాలను తెలుసుకొని పంట వేసినప్పుడు, ఆ తగ్గిన పోషక పదార్థాలను ఎరువుల రూపంలో అందిస్తే సరిపోతుందని ఆయన రైతులకు వివరించారు. మట్టి పరీక్షలో అమ్ల, క్షార సూచిక లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, లభ్య భాస్వరం, లభ్య పొటాషియం మొదలైనవి ఏ నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకోవచ్చునని గ్రామాలలోని రైతులు వారి యొక్క ఫీల్డ్ నుండి మట్టి నమూనాలని ఏ.ఈ.ఓ కి అందిస్తే, రైతులకు ఉచితంగా భూసార పరీక్ష చేయించటం జరుగుతుందని అజయ్ వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు లు పాయిల్ల శ్రీనివాస్, పాయిల్ల శరత్, గడ్డం అనిల్, అక్కల నరేష్, మోటపలుకుల తిరుపతి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

### - విగ్రహ దాత ఆసంపల్లి శ్రీనివాస్
### - రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ చేతుల మీదుగా..
### - ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**(హైదరాబాద్ ) బ్యూరో:** రామగుండం నియోజకవర్గం ఈసాల తక్కల్లపల్లిలో ఈరోజు ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. సామాజికవేత్త ఆసంపల్లి శ్రీనివాస్ అందించిన విగ్రహాన్నిఅంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. భారీ ఎత్తున జరిగిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన వందలాదిమంది అంబేద్కర్ అభిమానులకు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ తరపున డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, జుంజిపల్లి ఉమేశ్వర్, కొలుగూరి వెంకటేష్, ఈర్ల శ్రీనివాస్, కొంకటి లక్ష్మణ్ మరియు అంబేద్కర్ సంఘము నుండి బొంకూరి మధు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన ఐఏఎస్ ఆఫీసర్ పరికిపండ్ల నరహరి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను సభికులకు వివరించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తమ ఫౌండేషన్ కట్టుబడి ఉంటుందని అన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం కాకపోతే... ఉద్యమం ఉధృతమే

### - బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్

**గన్నేరువరం, జూన్ 8,:** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని యాస్వాడ మైసమ్మ గుట్ట వద్ద మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి కరీంనగర్ ను దగ్గర చేయాలని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ఆదివారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కంటికి దగ్గరగా ఉన్నా కాలుకు దూరంగా మారిన జిల్లా కేంద్రానికి బ్రిడ్జి నిర్మాణం చేపడితే విద్యార్థులకు, ఉద్యోగస్తులకు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మూడు మండలాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.తమ కమిషన్ల కోసం నాయకులు ఏర్పాటు చేసిన తీగల వంతెనతో ప్రజలకు ఏమీ ఉపయోగం లేదని ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇచ్చిన నాయకులంతా బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని లేని పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బామండ్ల రవీందర్, వరాల సతీష్, విలసాగర్, రామచంద్రం, ప్రశాంత్ యాదవ్, రేపాక బాబు, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మామిడిపల్లి లక్ష్మణ్, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### ఈ జబ్బులుంటే పచ్చి మామిడి ముక్కపై ఉప్పు, కారం కలిపి ఒక్కసారి తినండి..!

# మీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికినట్టే..



మామిడికాయల్లో చక్కెర చాలా తక్కువగా ఉంటుంది. మధుమేహంతో బాధపడేవారు ఎలాంటి ఆందోళన లేకుండా పచ్చి మామిడి కాయలను ఎంచక్కా లాంగించేయొచ్చు. ఇలా తీసుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరిగితే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మామిడి రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడతాయి. పచ్చిమామిడిలో మెగ్నీషియం, పొటాషియం,సంపూర్ణం గా లభిస్తాయి. కాబట్టి, పచ్చి మామిడికాయ తినడం గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పచ్చి మామిడికాయ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ నియంత్రణలోకి వస్తే అనేక వ్యాధులను నయం చేస్తుంది. మామిడికాయలో జీర్ణక్రియకు



అవసరమైన అమైలేస్ అనే డైజెస్టివ్ ఎంజైమ్‌లు ఉంటాయి. అమైలేస్ ఎంజైమ్‌లు సంక్లిష్ట కార్బోహైడ్రేట్‌లను మాల్టోస్, గ్లూకోజ్ వంటి చక్కెరలుగా మార్చడంలో సహాయపడతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి మామిడికాయలు ఉత్తమ ఔషధం. మామిడిలో ఉండే ఎనెనిన్ కొవ్వు, కొలెస్ట్రాల్, చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని ద్వారా మామిడి కూడా బరువు నియంత్రణలో సహాయపడుతుంది. పచ్చి మామిడి కాయ వేసవి వేడిమి ప్రభావాన్ని తగ్గిస్తుంది. శరీరంలో నీటి శాతం పెంచేందుకు పచ్చి మామిడి తింటారు. ఇమ్యునిటీ ని తిరిగి పొందాలంటే పచ్చి మామిడి దోహదం చేస్తుంది. పచ్చిమామిడిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. కాబట్టి పచ్చి మామిడి ముక్కలపై కాస్త ఉప్పు, కారం దట్టించి తింటే.. ఇమ్యునిటీ ని పెంచేందుకు సహకరిస్తుంది. అంతేకాదు.. పచ్చి మామిడి కాయ తినటం వల్ల వేసవిలో వచ్చే సమస్యల నుంచి రక్షించుకోవచ్చు. పచ్చి మామిడి కాయలో లభించే ఫెనోల్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్ పుష్కలంగా లభిస్తాయి. అది క్యాన్సర్ వల్ల వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మామిడి కాయ శరీరంలో వచ్చే వాపులను తగ్గిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి మామిడి కాయ తినడం వల్ల చర్మం సంరక్షిస్తుంది. పచ్చిమామిడి తినడం వల్ల మొటిమలు, మొటిమల వల్ల ఏర్పడే మచ్చలు, కంటికింద చారలు, గుంటలు పడడం, రకరకాల సమస్యలను దూరం చేస్తుంది.

## మధుమేహులకు అద్భుత మెడిసిన్ మంజిష్ట ..!ఇలా వాడితే షుగర్ కంట్రోల్..?

మధుమేహం.. ఇప్పుడు మన దేశంలో ఒక మహమ్మారిలా విస్తరిస్తోంది. ఒక లెక్క ప్రకారం, ప్రస్తుతం దేశంలో మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య 10 కోట్లకు పైగా ఉంది. ప్యాంక్రియాస్ తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయడం ఆపివేసినప్పుడు లేదా ఇన్సులిన్ ఉత్పత్తి చేయబడి సరిగ్గా పని చేయనప్పుడు వారు మధుమేహాన్ని ఎదుర్కొంటారు. అటువంటి పరిస్థితిలో ఆహారం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అవసరానికి మించి పెరుగుతాయి. ఈ పరిస్థితిని మధుమేహం అంటారు. ప్రస్తుతం మధుమేహానికి ఖచ్చితమైన చికిత్స లేదని మనందరికీ తెలిసిందే. అయితే మంచి జీవనశైలి, సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఈ తీవ్రమైన వ్యాధిని చాలా వరకు నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇదీ కాకుండా, ఆయుర్వేదంలో ఇటువంటి అనేక మూలికలు ప్రస్తావించబడ్డాయి. ఇవి మధుమేహం పరిస్థితిని నియంత్రించడంలో సహాయపడతాయి. అటువంటి ఆయుర్వేద



మూలికల గురించి ఇక్కడ తెలుసుకుందాం.. మంజిష్ట.. ఈ ఆయుర్వేద మూలిక మధుమేహ రోగులకు ఔషధం.. దీని శాస్త్రీయ నామం రూబియా కార్డిఫోలియా ఎల్. ఆయుర్వేదం కాకుండా అనేక ఆరోగ్య నివేదికలు కూడా ఈ హెర్బ్ మధుమేహం నిర్వహణలో తోడ్పడుతుందని చెబుతున్నాయి. సైన్స్ ప్రకారం, మంజిష్ట హైపోగ్లైసీమిక్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. దీని కారణంగా భోజనం తర్వాత శరీరంలో చక్కెర మొత్తం పెరగడానికి అనుమతించదు. ఇది కాకుండా, ఈ ఆయుర్వేద మూలికలో కొన్ని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇవి మధుమేహ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. మంజిష్ట దాని వేడి స్వభావం కారణంగా శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్ తగ్గించడం ద్వారా జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. తిన్న వెంటనే శరీరంలో చక్కెర తగ్గుతుంది. మళ్లీ పెరగదు. ఇది కాకుండా, మంజిష్ట ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఎలా తీసుకోవాలంటే. ఒక చెంచా మంజిష్ట పొడిని ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లతో కలిపి భోజనం, రాత్రి భోజనం తర్వాత క్రమం తప్పకుండా తీసుకుంటే మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.


## బొప్పాయితో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు.. కానీ దీన్ని ఇలా తింటేనే మంచిది!



బొప్పాయి.. అందరికీ అందుబాటులో ఉండే చవకైన రుచికరమైన, జ్యూసీ పండు. ఇది వేసవి కాలంలో తినడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది చాలా తీపి మరియు జ్యూసిగా ఉంటుంది, ఇది తిన్న తర్వాత చాలా తాజాగా అనిపిస్తుంది. బొప్పాయి చాలా రుచికరమైన పండు, ఇందులో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులో ఉండే పాపిన్ అనే ఎంజైమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో కూడా సహాయపడతాయి. అంతే కాదు బొప్పాయి తినడం వల్ల చర్మానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాదు.. బొప్పాయిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోండి. బొప్పాయి ప్రయోజనాలు: షుగర్‌ని నియంత్రించడం నుండి బరువు తగ్గడం వరకు, ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. బొప్పాయి చాలా రుచికరమైన పండు. ఇందులో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులో ఉండే పాపిన్ అనే ఎంజైమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందువల్ల, బొప్పాయిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. బొప్పాయిలో పపైన్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ ఎంజైమ్ ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. బొప్పాయి సహజమైన భేదిమందు కూడా. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో కూడా సహాయపడుతుంది. అందువల్ల, ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తినడం వల్ల ప్రేగుల కదలిక మెరుగుపడుతుంది. ఉబ్బరం సమస్యను నివారిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి: బొప్పాయిలో యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇది కెరోటినాయిడ్స్ వంటి యాంటీ-ఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా అనేక వ్యాధులను నివారిస్తుంది. గుండెకు ప్రయోజనకరం: బొప్పాయిలో విటమిన్ సి, యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందువల్ల, బొప్పాయి తినడం ఆరోగ్యకరమైన గుండెకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది: బొప్పాయిలో లైకోపీన్, విటమిన్ సి ఉన్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తుంది. అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. డార్క్ స్పాట్స్‌తో పాటు ముడతలు, ఫైన్ లైన్‌లను తగ్గించడంలో కూడా ఇది చాలా సహాయపడుతుంది. ఫలితంగా మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం ఏర్పడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది: బొప్పాయిలో ఉండే ఫైబర్ బ్లడ్ షుగర్ నియంత్రణలో సహాయపడుతుంది . ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో చాలా సహాయపడుతుంది. కడుపు నిండుగా ఉంటుంది: బొప్పాయిలో ఫైబర్ ఉంటుంది. ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉంచుతుంది. దీని కారణంగా, అతిగా తినాలనే కోరిక ఉండదు. బరువు పెరగడం లేదా ఉబ్బరం వంటి సమస్యలను నివారించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

## మారేడు దళం.. సర్వ రోగాలకు దివ్యౌషధం..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే ప్రయోజనాలు అమోఘం..

బిల్వ పత్రం.. మారేడు దళం.. ఆ మహా శివుడికి అత్యంత ప్రితికరమైనది. పరమ శివుడిని ప్రసన్నం చేసుకోవాలంటే..చెంబు నీళ్లు, ఒక్క మారేడు దళం సమర్పిస్తే చాలని భక్తుల విశ్వాసం. ఎటువంటి ఆడంబరాలు లేకపోయినా బిల్వదళం అర్పిస్తే ఆ పరమేశ్వరుడు సంతోషిస్తాడని అంటారు. అయితే ఈ మారేడు దళం కేవలం పూజకు మాత్రమే కాదు.. ఆరోగ్యానికి కూడా చాలామంచిదని ఆయుర్వేద నిపుణుల చెబుతున్నారు. మారేడులో విటమిన్లు ఎ, బి1, బి2, సి, ఖనిజాలు, కాల్షియం, పొటాషియం, ఇనుముతో కూడిన అనేక పోషకాలున్నాయి. ముఖ్యంగా వేసవికాలంలో ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో మారేడు ఆకులు తింటే బోలెడు ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ఔషధ గుణాలు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. మారేడు ఆకులు.. ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుంది. దీనిని తినడం వల్ల గుండె జబ్బులు, కాలేయ సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. ఖాళీ కడుపుతో బెల్‌పత్రి తింటే ఎన్నో ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో మారేడు ఆకులను తీసుకుంటే, అందులో ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మారేడు ఆకులలో ధమనులు గట్టిపడకుండా నిరోధించే గుణం వుంది. ఇవి గుండెను వ్యాధుల నుండి రక్షిస్తాయి. బిల్వ పత్రంలో పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తపోటుతో బాధపడేవారికి మేలు చేస్తుంది. బిల్వపత్రంలో ఉండే ఐరన్ రక్తంలో ఎర్ర రక్త కణాలు, హిమోగ్లోబిన్ కౌంట్‌ను పెంచుతుంది. బిల్వ పత్రంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండటం వల్ల ఇది శరీరానికి తగినంత శక్తిని అందిస్తుంది. మారేడుతో అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. తరచూ మీకు నోటిపూతతో ఇబ్బంది పడేవారు ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో బెల్ పత్రి తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం మీరు నాలుగు మారేడు ఆకులు తీసుకుని పచ్చిగానే నమిలి తినవచ్చు. అంతేకాదు..మధుమేహం బాధితులకు సైతం ఇది మందుగా పనిచేస్తుంది. బిల్వ పత్రం అతిసార, మొలలు, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది. డయాబెటిక్ పేషెంట్ ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో బెల్‌పత్రిని తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ ఆకులు తినటం వల్ల గ్యాస్, అసిడిటీ, అజీర్ణం నుండి ఉపశమనం లభిస్తుంది. మారేడులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకలను బలోపేతం చేయడానికి, బోలు ఎముకల వ్యాధిని నివారిస్తుంది. జ్వరం, జలుబు, దగ్గు మరియు అలెర్జీలతో బాధపడేవారికి బెల్పత్రి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. వేసవిలో ఉదయాన్నే పరగడుపున ఈ పచ్చి ఆకును తింటే ఈ ప్రయోజనాలు పొందుతారు. మలబద్ధకం లేదా ఉదయం సరిగ్గా కడుపుని ఖాళీ చేయని సందర్భాల్లో తక్షణ ఉపశమనం పొందడంలో మారేడు ఆకులు చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది మీ పొట్టను శుభ్రపరచడమే కాకుండా మీ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. బెల్ పత్రిని ఎలా తీసుకోవాలి? కొన్ని ఆకులను తీసుకుని నీటితో శుభ్రం చేసి వాటిని అలాగే నమిలి తినేయండి. లేదంటే మారేడు ఆకులో కాస్త నల్ల ఉప్పు వేసి కొద్దిగా వేడి చేసి తినవచ్చు. బేల్‌పత్రిని ఒక గ్లాసు నీటిలో మరిగించి దాని కషాయాన్ని కూడా సేవిస్తారు.



## మీరు మర్చిపోయి కూడా లెమన్ వాటర్ తాగకండి..! అది మీ ఆరోగ్యానికి మేలు కంటే హాని చేస్తుంది!



లెమన్ వాటర్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దాని ఆరోగ్య ప్రయోజనాల కారణంగా మనలో చాలా మంది ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాస్ లెమన్ వాటర్ తాగడం అలవాటుగా చేసుకున్నారు. ఇది శరీరాన్ని డిటాక్సిఫై చేసి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నిమ్మకాయ నీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే నిమ్మరసం తాగడం వల్ల కొంతమందికి హాని కలుగుతుందని మీకు తెలుసా? అవును, లెమన్ వాటర్ ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో అనేక సమస్యలు వస్తాయి ..కాబట్టి..ఎలాంటి వ్యక్తులు నిమ్మరసం తాగకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. ఎసిడిటీ సమస్య ఉన్నవారు.. ఎసిడిటీ సమస్యలతో బాధపడేవారు లెమన్ వాటర్ ఎక్కువగా తీసుకోవడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెద్ద మొత్తంలో సిట్రిక్ యాసిడ్ ను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో ఆమ్లతను మరింత పెంచుతుంది. దీని కారణంగా మీరు ఇతర కడుపు సంబంధిత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దంత సమస్యలు ఉన్నవారు .. దంత సమస్యలు ఉన్నవారు లెమన్ వాటర్ తాగడం మానుకోవాలి. నిమ్మకాయల్లో ఉండే యాసిడ్ పంటి ఎనామిల్‌ను దెబ్బతీస్తుంది. ఇది దంతాలలో సున్నితత్వ సమస్యలను కలిగిస్తుంది. మీకు దంత సమస్యలు ఉంటే, దానిని తీసుకునే ముందు మీ దంతవైద్యుడిని సంప్రదించండి. ఎముక సంబంధిత సమస్యలు ఉన్నవారు .. ఎముక సంబంధిత సమస్యలతో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. నిమ్మరసం ఎక్కువగా తాగడం వల్ల మీ ఎముకలు దెబ్బతింటాయి. వాస్తవానికి, ఇందులోని యాసిడ్ కారణంగా, ఎముకలలో కాల్షియం తీవ్రమైన కోతను అనుభవిస్తుంది. ఇది మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. దీని కారణంగా ఎముకలు బలహీనపడటం ప్రారంభిస్తాయి. లోపల నుండి బోలుగా మారతాయి. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు.. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. ఇది మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడేవారు దీనిని పొరపాటున కూడా తీసుకోరాదు. హార్ట్ బర్న్ సమస్య.. హార్ట్ బర్న్ సమస్యతో బాధపడేవారు నిమ్మరసం తాగడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెప్సిన్ అనే ఎంజైమ్‌ను సక్రియం చేస్తుంది. అంతే కాకుండా దీన్ని రోజూ తీసుకోవడం వల్ల పెప్టిక్ అల్సర్ సమస్య పెరుగుతుంది.

## ఈ వ్యాధులను తరిమికొట్టే సీతాఫలం.. ఆకులు కూడా అమృతమే!



సీతాఫలాన్ని ఆంగ్లంలో “కస్టర్డ్ యాపిల్” అంటారు . ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న భారత ఉపఖండంలో ప్రసిద్ధి చెందిన పండు. సీతాఫలం మాత్రమే కాదు, దాని ఆకులు కూడా చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. దీని ఆకులను ముఖ్యంగా ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఎందుకంటే ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. మీరు సీతాఫలం ఆకులను జ్యూస్, డికాక్షన్ లేదా టీ రూపంలో తీసుకోవచ్చు. ఇది శరీరానికి అనేక పోషకాలను అందిస్తుంది. మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సీతాఫలం ఆకులు మన ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయో తెలుసుకుందాం. సీతాఫలం ఆరోగ్య ప్రయోజనాలు: సీతాఫలం ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం కూడా ఉన్నాయి. ఇందులో చాలా యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. శరీరంలో వాపు, నొప్పి నుండి ఉపశమనాన్ని అందించే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. డయేరియా సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల అనేక పొట్ట సంబంధిత సమస్యలు నయమవుతాయి. సీతాఫలంలో టానిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అతిసారాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ ఆకులో ఉండే పీచు అజీర్ణ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. గ్యాస్ ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకుల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి పెరుగుతుంది. చర్మానికి మేలు చేస్తుంది: సీతాఫలం ఆకులు చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇందులోని విటమిన్ సి చర్మానికి పూర్తి పోషణను అందిస్తుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మానికి పోషణను అందిస్తాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దద్దుర్లు, మొటిమల వంటి చర్మ సమస్యల నుండి ఉపశమనం పొందుతాయి. క్యాన్సర్ నుండి రక్షిస్తుంది: సీతాఫలం ఆకుల్లో క్యాన్సర్ నిరోధక శక్తి ఉందని చాలా అధ్యయనాలు కనుగొన్నాయి. సీతాఫలంలో ఉండే ఫైటోకెమికల్స్ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. ఇందులో ఉండే విటమిన్ సి మరియు విటమిన్ ఎ పోషకాలు క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడతాయి.

## పుట్టగొడుగులు తింటే యూరిక్ యాసిడ్ పెరుగుతుందా? ఎలాంటి కూరగాయలు తీసుకోవాలి?

ఎలివేటెడ్ యూరిక్ యాసిడ్ ఈ రోజుల్లో సాధారణ సమస్యలలో ఒకటిగా మారుతోంది. ఇది జీవక్రియ రుగ్మత, దీనిలో శరీరం ప్యూరిన్‌లను జీర్ణించుకోలేకపోతుంది. అవి ఎముకలలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. ఇది చేతులు, కాళ్లు, మణికట్టు చుట్టూ పేరుకుపోతుంది. తరువాత గౌట్ సమస్యలను కలిగిస్తుంది. ఇలా శరీరంలో ప్యూరిన్స్ పెరగడం వల్ల ఎముకల్లో ఖాళీలు ఏర్పడి వాపులు వస్తాయి. దీంతో కీళ్లలో దృఢత్వం, నొప్పి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో ప్యూరిన్ పెంచే ఆహారాలకు దూరంగా ఉండాలి. ఇంతకీ మష్రూమ్ తినడం వల్ల యూరిక్ యాసిడ్ పెరుగుతుందో లేదో తెలుసుకుందాం? పుట్టగొడుగులలో యూరిక్ యాసిడ్ పెంచడానికి పని చేసే ప్రొటీన్లు మంచి మొత్తంలో ఉంటాయి. ఇది మీ ఎముకలలో పెరగడం మొదలవుతుంది. వాపు పెరుగుతుంది. నిజానికి, మీరు పుట్టగొడుగులను తిన్నప్పుడు శరీరం వాటిని జీర్ణం చేస్తుంది. ప్యూరిన్లను విసర్జిస్తుంది. ఈ ప్యూరిన్ ఎముకలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. అడపాదడపా నొప్పిని కలిగించే సమస్యను సృష్టిస్తుంది. మీరు ప్రోటీన్ అధికంగా ఉండే ఇతర ఆహారాలను తిన్నప్పుడు ఈ నొప్పి తీవ్రమవుతుంది. అందుకే యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే లేదా మీకు గౌట్ సమస్య ఉంటే పుట్టగొడుగుల వినియోగాన్ని నివారించండి. మీ యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే, మీరు పుట్టగొడుగులకు బదులుగా అధిక ఫైబర్ ఫుడ్స్ తినవచ్చు. వోట్స్, గంజి, నారింజ వంటి పండ్లు వంటివి. ఇది కాకుండా మీరు ఈ సమస్యలో చాలా ఉపయోగకరంగా ఉండే మొలకెత్తిన ధాన్యాలను కూడా తీసుకోవచ్చు. ఈ పరిస్థితులన్నింటిలో మీరు పుట్టగొడుగులకు బదులుగా ఈ ఆహారాన్ని తినాలి. ఇది కాకుండా మీరు ఆకుకూరలు, పసుపు వంటి వాటిని తీసుకోవాలి. ఇది కాకుండా మీరు చియా గింజలను తినవచ్చు. గోరువెచ్చని నీరు తాగవచ్చు. ఈ పదార్థాలు యూరిక్ యాసిడ్ తగ్గించడంలో కూడా సహాయపడతాయి.

# విశ్వేజి



## షుగర్ పేషెంట్లకు ఇది దివ్యౌషధం..

పచ్చి బొప్పాయి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే పోషకమైన పండు. పచ్చి బొప్పాయి తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. దీని తీసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియదు. ఈ పచ్చి బొప్పాయి తినడం మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఈరోజు మనం పచ్చి బొప్పాయి తినడం వల్ల కలిగే అనేక గొప్ప ప్రయోజనాల గురుంచి తెలుసుకుందాం. డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరమైనది మధుమేహ రోగులకు పచ్చి బొప్పాయి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే పపైన్ అనే ఎంజైమ్ శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఎంతో సహాయపడుతుంది. షుగర్ పేషెంట్లు క్రమం తప్పకుండా పచ్చి బొప్పాయిని తీసుకుంటే షుగర్ కంట్రోల్ లో ఉంటుంది. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. పచ్చి బొప్పాయి తినడం వల్ల మీ జీర్ణవ్యవస్థ బలపడుతుంది. ఇది జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్, పపైన్ పుష్కలంగా ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా.. మలబద్ధకం, గ్యాస్, ఇతర జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది.. ఒకవేళ బరువు తగ్గాలని ఆలోచిస్తుంటే పచ్చి బొప్పాయి ఎంతో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్, నీరు అధికంగా ఉండటం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. దీంతో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోలేము. చర్మాన్ని ఆరోగ్యంగా చేస్తుంది.. ఇది చర్మాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుస్తాయి. అయితే,పచ్చి బొప్పాయిని పేస్ట్ లా తయారు చేసుకుని, దానికి పాలు, పసుపు కలిపి ముఖానికి అప్లై చేసుకోవచ్చు. దీనివల్ల ముఖం మెరిసేలా అవుతుంది. జుట్టును ఆరోగ్యంగా చేస్తుంది.. పచ్చి బొప్పాయి జుట్టును ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడుతుంది. పచ్చి బొప్పాయిని పేస్ట్ లా చేసి జుట్టుకు అప్లై చేసుకోండి. కొంత సమయం తర్వాత ఈ పేస్ట్‌ని చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. ఈ నివారణతో జుట్టు చాలా ఆరోగ్యంగా, సిల్కీగా మారుతుంది. ఇది చుండ్రును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

## వేసవిలో దానిమ్మ రసం తాగితే ఎన్ని లాభాలో..?



వేసవి మొదలైంది. ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇదే సమయంలో చర్మానికి కూడా ఎక్కువ పోషణ అవసరం. వేసవి కాలంలో చాలా మంది తమ ఆహారంలో జ్యుసి పండ్లను చేర్చుకుంటారు. వేసవిలో గొంతు తడుపుకోవడానికి ఎక్కువగా చల్లగా ఉండే వాటి కోసం చూస్తున్నప్పటికీ, మన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పండ్ల రసాలను మాత్రమే తీసుకోవడానికి ప్రయత్నించాలి. ఇందులో భాగంగానే ఖచ్చితంగా దానిమ్మ రసం తాగాలి. దీని వల్ల ఒకటి రెండు కాదు, చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అవసరమైన పోషకాలు, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది. ప్రత్యేకత ఏమిటంటే దానిమ్మ రసం తాగడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా చర్మ ఛాయ కూడా మెరుగుపడుతుంది. ప్రతిరోజూ తాజా దానిమ్మ రసం తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో ఇప్పుడు తెలుసుకుందా 1. దానిమ్మ రసం గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణిస్తారు. దానిమ్మ రసం తాగడం వల్ల గుండెల్లో మంట తగ్గుతుంది. దానిమ్మ రసంలో ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు గుండెను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తాయి. దీనివల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. 2. దానిమ్మ రసం త్వరగా బరువు తగ్గడానికి హాయపడుతుంది. దానిమ్మపండులో ఉండే పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు జీవక్రియను పెంచడానికి, కొవ్వును కాల్చడానికి సహాయపడతాయి. ఇది ఆకలిని కూడా అణిచివేస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దీనితో అతిగా తినడం నివారించవచ్చు. ఇది వేగంగా బరువు తగ్గడానికి దారితీస్తుంది. 3. క్యాన్సర్ ఒకసారి వస్తే దాని నుంచి కోలుకోవడం కష్టమవుతుంది. చాలా తక్కువ మంది రోగులు ఈ వ్యాధి నుండి కోలుకుంటారు. దానిమ్మ రసం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడుతుంది. దానిమ్మలో క్యాన్సర్ నిరోధక లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇది క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. 4. దానిమ్మ రసం తాగడం వల్ల మీ చర్మానికి చాలా మేలు ఎంతో జరుగుతుంది. ఇందులో విటమిన్ సి ఉండటం వల్ల నల్లటి మచ్చలు మొదలైన వాటిని నివారించడంలో సహాయపడుతుంది. అదనంగా ఇందులో అధిక మొత్తంలో యాంటీ-ఆక్సిడెంట్లు చర్మానికి మేలు చేస్తాయి. దానిమ్మ రసంలో యాంటీ-ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్ నష్టాన్ని తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. బలమైన రోగనిరోధక వ్యవస్థ కారణంగా ఇన్ఫెక్షన్లు మొదలైన వాటి ప్రమాదం కూడా తగ్గుతుంది.

## నల్లగా ఉన్నాయని దూరం పెట్టకండి.. తింటే ఎన్నో లాభాలు..

మన అర్యోగం మనం తీసుకునే ఆహారం మీద ఆధారపడి ఉంటుంది. ఆర్యోగంగా ఉండాలంటే తరచుగా పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి. ఇవి ఆర్యోగానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ క్రమంలో బ్లాక్ క్యారెట్ తీసుకోవడం వల్ల కూడా అనేక లాభాలు ఉన్నాయి. ఇది రుచికరంగా కూడా ఉంటుంది. ఆర్యోగానికి ఎంతో మంచిది కూడా. అయితే మార్కెట్లో దొరికే నార్మల్ క్యారెట్ గురుంచి అందరికి తెలుసు కానీ, బ్లాక్ క్యారెట్ గురుంచి ఎవరికి అంతగా తెలియదు. ఇప్పుడు బ్లాక్ క్యారెట్ తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. బ్లాక్ క్యారెట్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. బ్లాక్ క్యారెట్‌లో ఉండే ఆంథోసైనిన్స్, పొటాషియం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. అంతేకాకుండా.. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. రక్తం గడ్డకట్టడాన్ని కూడా నిరోధిస్తుంది. అలాగే, షుగర్ ఉన్నవారు దీని పుష్కలంగా తినొచ్చు. బ్లాక్ క్యారెట్‌లో ఫైబర్ ఉంటుంది. కావున ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో ఎంతో సహాయపడుతుంది. కాబట్టి దీన్ని తినడం వల్ల మధుమేహం రాకుండా ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. బ్లాక్ క్యారెట్ లో అధిక మొత్తంలో విటమిన్ ఎ ఉంటుంది. దీని కారణంగా బ్లాక్ క్యారెట్



కంటి చూపును మెరుగుపరచడంలో పనిచేస్తుంది. కంటిశుక్లం వంటి సమస్యలను కూడా నివారిస్తుంది. అంతేకాకుండా బ్లాక్ క్యారెట్‌లో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, అపానవాయువు, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. బ్లాక్ క్యారెట్‌లో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. అంతేకాకుండా చలికాలంలో వచ్చే ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. ఇకపోతే బ్లాక్ క్యారెట్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉందనే భావన కలిగిస్తుంది. బ్లాక్ క్యారెట్‌లో ఉండే విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి. అంతేకాకుండా జుట్టును బలోపేతం చేస్తాయి.

# మార్కెట్

## మారుతికి గట్టి షాక్

### 40 శాతం దిగువకు పడిపోయిన మార్కెట్ వాటా

న్యూఢిల్లీ, మే 5 : కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీకి గట్టి షాక్ తగిలింది. దేశీయ ప్యాసింజర్ కార్ల మార్కెట్లో అగ్రస్థాయిలో దూసుకుపోయిన కంపెనీకి బ్రేక్‌లు పడ్డాయి. సంస్థకు మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్ మోటర్‌ల నుంచి పోటీ తీవ్రతరమవుతుండటంతో కంపెనీ మార్కెట్ వాటా ఏటేటా పడిపోతున్నది. ఇదే క్రమంలో గత నెలలో 40 శాతం దిగువకు పడిపోయిందని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(ఫాడా) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. రెండో స్థానానికి మహీంద్రా ఎగబాకింది. ఈ స్థానంలో ఉన్న హ్యుందాయ్ 12.47 శాతం మార్కెట్ వాటాతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. అలాగే టాటా మోటర్స్ 12.59 శాతం మార్కెట్‌తో మూడో స్థానంలో కొనసాగుతున్నది. గడిచిన నెలలో దేశీయంగా 3,49,939 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3,44,594 యూనిట్లతో పోలిస్తే 1.55 శాతం అధికం. వీటిలో మారుతి సుజుకీ 1,38,021 యూనిట్ల పీవీలను విక్రయించింది. ఏప్రిల్ నెలలో మహీంద్రా అండ్ మహీంద్రా 48,405 యూనిట్ల వాహనాలను విక్రయించింది. కంపెనీకి చెందిన ఎస్‌యూవీలకు మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటంతో 13.83 శాతం వాటాను దక్కించుకున్నది. అలాగే హ్యుందాయ్ మోటర్ 43,642 యూనిట్ల వాహనాలను విక్రయించి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది.




## పాక్-భారత్ మధ్య ఉద్రిక్తతలు.. స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. పాక్తిసాన్‌తో ఉద్రిక్తల వేళ.. కేంద్రం ఈ నెల 7న మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. అలాగే, అమెరికాలో మెడిసిన్స్ ఉత్పత్తి చేయాలని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. అదే సమయంలో అమెరికా ఫెడ్ రిజర్వ్ బుధవారం వడ్డీ రేట్లపై ప్రకటన చేయనున్నది. ఈ క్రమంలో అప్రత్తమంగా వ్యవహరించడంతో మార్కెట్లు పతనమయ్యాయి. అలాగే, మార్కెట్ ప్రారంభం కాగానే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,907.24 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,981.58 పాయింట్లకు పెరిగిన సెన్సెక్స్.. 80,481.03 పాయింట్లకు పడిపోయింది. చివరకు 155.77 పాయింట్లు పతనమై.. 80,641.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.55 పాయింట్లు తగ్గి 24,379.60కి తగ్గింది. నిఫ్టీ నిఫ్టీ 81.55 పాయింట్లు తగ్గి 24,379.60 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 787 షేర్లు లాభపడగా.. 3,011 షేర్లు పతనమయ్యాయి. సెన్సెక్స్‌లో ఎటర్నల్, టాటా మోటార్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా అత్యధికంగా నష్టాలను చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందూస్తాన్ యూనిలీవర్, నెస్లే, మారుతి లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లలో షాంఘై ఎస్‌ఎస్‌ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ లాభాలతో ముగిశాయి. ఆటో మినహా మిగతా అన్ని రంగాల సూచీలు పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ దాదాపు 5 శాతం, రియాల్టీ ఇండెక్స్ 3.5 శాతం, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా, ఆయిల్, గ్యాస్, పవర్ ఒకటి నుంచి 2.6 శాతం పడిపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 2 శాతం చొప్పున తగ్గాయి.

## 25 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసిన ఆర్బీఐ

ముంబై : రిజర్వుబ్యాంక్ మరో 25 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో 25 టన్నుల గోల్డ్ రిజర్వులను పెంచుకున్నది. దీంతో సెంట్రల్ బ్యాంక్ వద్ద బంగారం నిల్వలు 879.59 టన్నులకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 2024 నాటికి 854.73 టన్నుల గోల్డ్ నిల్వలు ఉండగా..ప్రస్తుతం 57 టన్నులను పెంచుకున్నది. గడిచిన ఏడేండ్లలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో కొనుగోలు చేయడం ఇదే తొలిసారి. ఒకవైపు పసిడి ధరలు రికార్డు స్థాయి లో పెరిగినప్పటికీ ఆర్బీఐ గోల్డ్‌ను కొనుగోలు చేయడం విశేషం. సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వల్లో 511.99 టన్నుల గోల్డ్‌ను స్థానికంగా నిల్వ చేయగా, మరో 348.62 టన్ను లను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ (బీఐఎస్) వద్ద, డిపాజిట్ రూపంలో 18.98 టన్నులు ఉంచింది.




## కాంతార నటికి బర్త్‌డే విషెస్.. నితిన్ 'తమ్ముడు' నుంచి కొత్త పోస్టర్

టాలీవుడ్ నటుడు నితిన్ కొంతకాలంగా సరైన సక్సెస్ లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల వచ్చిన రాబిన్‌హుడ్ చిత్రం కూడా ఆశించిన విజయం అందుకోలేదు. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ప్రస్తుతం తమ్ముడు అనే సినిమాలో నటిస్తున్నాడు. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ ఎమోషనల్ యాక్షన్ డ్రామా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాలో కాంతార నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నేడు సప్తమి బర్త్‌డే కావడంతో ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ ఫొటో చూస్తుంటే.. ట్రైబల్ యువతిగా సప్తమి కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు తమ్ముడు సినిమా మొదలై రెండేళ్లు అవుతున్నా, ఇప్పటివరకు పెద్దగా అప్‌డేట్స్ రాలేదు. కేవలం రెండు గ్లింప్స్‌ను మాత్రమే విడుదల చేశారు. మొదట ఈ చిత్రాన్ని 2025 జూలై 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, విజయ్ దేవరకొండ 'కింగ్ డమ్' కారణంగా విడుదల వాయిదా పడిందని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం, జూలై 25న 'తమ్ముడు' సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.



## ఏంటి.. అఖిల్ పెళ్లికి సమంత వచ్చిందా.. వైరల్ అవుతున్న వీడియో..!

టాలీవుడ్ యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని, తన ప్రియురాలు జైనాబ్ రవ్జీతో వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. ఈ వివాహం జూన్ 6, 2025న హైదరాబాద్‌లోని నాగార్జున ఇంట్లో అంగరంగ వైభవంగా జరిగింది. పెళ్లి వేడుకకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు. జైనాబ్‌తో గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న అఖిల్ పెద్దలని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఈ రోజు వారి రిసెప్షన్ జరగనున్నట్టు తెలుస్తుంది. అఖిల్ పెళ్లికి.. పలువురు సినీ పరిశ్రమ సెలబ్రిటీలు హాజరు కావడంతో అఖిల్ జైనబ్ పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. నాగార్జున, నాగ చైతన్య తమ సోషల్ మీడియా అకౌంట్ ద్వారా నవ దంపతుల ఫోటోలు షేర్ చేశారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాని షేక్ చేశాయి. అయితే ఈ పెళ్లికి సమంత కూడా వచ్చిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతుంది. నాగచైతన్యతో విడిపోయిన తరువాత కూడా.. అఖిల్, సమంత మధ్య మంచి స్నేహబంధం నడిచింది. ముఖ్యంగా సమంత ప్రతి పుట్టినరోజుకి అఖిల్ విష్ చేస్తుంది. అలానే సమంత కూడా అఖిల్ ప్రతి పుట్టినరోజుకి విష్ చేస్తూ ఉంటుంది. ఇక సోషల్ మీడియాలో కూడా ఒకరి పోస్టులు ఒకరు కొన్నిసార్లు లైక్ చేయడం మనం చూడవచ్చు. ఇలా వారిద్దరి మధ్య మంచి సత్సంబంధం ఉంది కాబట్టి అఖిల్ పెళ్లికి సమంత వచ్చిందని , సమంత కార్ పార్కింగ్ ఏరియాలో నడుస్తూ ఉన్న వీడియోని చూపిస్తూ తెగ షేర్ చేస్తున్నారు. అయితే సమంత ఎక్కడో బయటకు వెళ్లినప్పుడు వీడియోని అఖిల్ పెళ్ళికి జత చేసి దానిని సోషల్ మీడియా పేజ్‌లలో తెగ షేర్ చేస్తున్నారు.






## రజనీ స్పూర్తితో లూసిఫర్‌లో సన్నివేశం

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'లూసిఫర్2: ఎంపురాన్. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ముస్తాబవుతోంది. 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్ సొంతం చేసుకున్న 'లూసిఫర్'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా 'లూసిఫర్'లోని ఓ సన్నివేశం గురించి పృథ్వీరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. లూసిఫర్' సినిమా మొత్తానికి మోహన్‌లాల్ ఎంట్రీ సన్నివేశం హైలైట్‌గా నిలిచింది. ఆ సన్నివేశానికి రజనీకాంత్ స్పూర్తి అని దర్శకుడు తెలిపారు. 'మోహన్‌లాల్ అంటే ఎవరో చెప్పడానికి లూసిఫర్‌లో ఒక్క సన్నివేశం సరిపోతుంది. ఆ ఎంట్రీ సీన్ మొత్తాన్ని రజనీకాంత్ గురించి విన్న కథను స్పూర్తిగా తీసుకొని తెరకెక్కించాను. రజనీ నివాసం ఉండే పోయెస్ గార్డెన్ వీధిలో ఎప్పుడూ ఎలా ఉంటుందో ఒక వార్తా కథనంలో చదివాను. ఆ కథనాన్ని చదివిన తర్వాత రజనీకాంత్‌ని స్పూర్తిగా తీసుకొని ఒక సీన్ రాశాను. అదే మోహన్‌లాల్ ఎంట్రీ- సీన్. సినిమాలో దానికి మంచి ఆదరణ లభించిందని చెప్పారు. రజనీకాంత్‌కు పృథ్వీరాజ్ వీరాభిమాని అని తెలిసిందే. గతంలోనూ ఎన్నో సందర్భాల్లో రజనీకాంత్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తంచేశారు. 'లూసిఫర్ 2' -ట్రైలర్‌ను కూడా ఆయన మొదట రజనీకాంత్‌కు చూపించారు. రజనీ ఈ ట్రైలర్ చూసి తననెంతో ప్రశంసించారని ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తాను రజనీ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు- చెప్పారు. ఒకసారి ఆ అవకాశం వచ్చినా డేట్స్ సర్దుబాటు- చేయలేక డైరెక్ట్ చేయలేకపోయినట్లు- తెలిపారు.

## చిరు ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్న అనీల్ రావిపూడి..

మెగాస్టార్ చిరంజీవి కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేస్తున్నారు. ఆయన ఇటీవల విశ్వంభర చిత్ర షూటింగ్ పూర్తి చేసి ఇప్పుడు అనీల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్నాడు. డైరెక్టర్ వశిష్టతో చేసిన విశ్వంభర చిత్రం సోషియో ఫాంటసీ సినిమాగా తెరకెక్కుతుంది . ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా, కీరవాణి విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు.అయితే విశ్వంభర సినిమాపై ఇప్పటి వరకు ఎటువంటి అప్ డేట్ రాలేదు. కాని ఇటీవల మొదలైన అనిల్ రావిపూడి సినిమా మాత్రం పరుగులు పెడుతోంది. ఇక ఈసినిమా స్టార్ట్ అయిన అప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తూనే ఉంది. ఈ మూవీ ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్టు తెలుస్తుండగా, మరి కొద్ది రోజులలో రెండో షెడ్యూల్ మొదలు పెట్టనున్నారట. చిరంజీవి కెరీర్లో 157వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్లో చిరంజీవి డ్యూయల్ రోల్ లో కనిపించనున్నారనే వార్త ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అయింది. రెండు పాత్రలలో ఒక పాత్ర వింటేజ్ చిరంజీవిని గుర్తు చేసేలా ఉంటుందని, మరో పాత్ర ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉంటుందట. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు.



## స్వేచ్ఛగా బతకడమే సక్సెస్

దక్షిణాదిలో తిరుగులేని నటి అనిపించుకున్న హీరోయిన్ సమంతా రుతుప్రభు. పదిహేనేండ్లుగా ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించి అభిమానులను అలరిస్తున్నది. ఇటీవల విడుదలైన 'శుభం' సినిమాతో నిర్మాతగా కొత్త ప్రయాణం ప్రారంభించిందామె. వ్యక్తిగత కారణాల వల్ల యాక్టింగ్ నుంచి కొంతకాలం బ్రేక్ తీసుకున్నానని త్వరలోనే 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తానంటున్నది సామ్. జీవితంలో ఎదురైన ప్రతి సమస్యను సవాలుగా స్వీకరించానంటూ సమంత పంచుకున్న కబుర్లు.. ఏ విషయంలో అయినా నా మనసుకు నచ్చిందే చేశాను. ఓ అభిమాని నా కోసం గుడి కట్టారని తెలిసి ఆశ్చర్యపోయా. నా మీద ఇంత ప్రేమ చూపిస్తున్నారా? అనుకున్నా. అతను తన ప్రేమను చూపించే తీరు మంచిదే అనిపించినా.. గుళ్లు కట్టి పూజలు చేసే పద్ధతిని మాత్రం ఎంకరేజ్ చేయను.ఆరోగ్యపరమైన సమస్యల రీత్యా కొంతకాలం వర్క్ నుంచి బ్రేక్ తీసుకున్నా. యాక్టింగ్‌ను ఎంతో మిస్ అయ్యా. నటన మర్చిపోయానేమో అనిపించింది. 'రక్త్ బ్రహ్మాండ్: ద బ్లడీ కింగ్‌డమ్' షూట్‌లోకి అడుగుపెట్టిన తొలిరోజు అంత సులువుగా అనిపించలేదు. ఒకసారి యాక్టింగ్‌లోకి దిగితే జీవితాంతం అది మనలో భాగం అవుతుందని అప్పుడు అర్థమైంది. జీవితంలో కొన్ని మంచిరోజులు, కొన్ని చెడ్డరోజులు ఉంటాయి. ఒకానొక స్టేజిలో లైఫ్‌లో ముందుకెళ్లలేనేమో అనిపించింది. వెనక్కి తిరిగి చూస్తే ఇంతదాకా వచ్చానా అనిపిస్తుంది. నటిగా నిలదొక్కుకోవడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరాటపడేదాన్ని. ఈ క్రమంలో తొలినాళ్లలో కొన్ని నచ్చని కథలని కూడా ఎంచుకున్నా. ప్రస్తుతం కథల ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నా.విజయం కన్నా ఓటమి వల్లే ఎక్కువ విషయాలు నేర్చుకోవచ్చు. నా సినిమా తొలిసారి ఫ్లాప్ అయినప్పుడు కుమిలిపోయా. నేనొక ఫెయిల్యూర్‌ని అనుకున్నా. ఇన్నాళ్ల అనుభవంతో సక్సెస్ అంటే నా దృష్టిలో నిర్వచనం మారింది. స్వేచ్ఛగా జీవించడమే విజయం అని అర్థమైంది. ప్రస్తుతం నేను సక్సెస్‌లో లేనని చాలామంది అనుకుంటారు. కానీ, గతంతో పోలిస్తే ఇప్పుడే విజయవంతంగా రాణిస్తున్నా.'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'తో నిర్మాతగా కొత్త ప్రయాణం ప్రారంభించా. కొత్త కథలు చెప్పాలి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది 'ట్రాలాలా' ముఖ్య ఉద్దేశం. నటిగా స్టార్‌డమ్ వచ్చినా.. చిత్ర పరిశ్రమ కోసం ఏదో చేయాలనే ఆలోచన ఎప్పుడూ ఉండేది. అందుకే కాస్త విరామం తీసుకుని నిర్మాతగా మారాలని ఫిక్స్ అయ్యా. కెరీర్ ఆరంభంలోనే చాలా సక్సెస్‌లు చూశా. నేను నటించిన సినిమాలు వరుస విజయాలు అందుకున్నాయి. దాంతో అందరూ నన్ను 'గోల్డెన్ లెగ్ ఆఫ్ తెలుగు సినిమా' అని పిలిచేవారు.





## నటనపై లండన్‌లో శిక్షణ.. మహేష్ బాబు సపోర్ట్‌తో ఇండస్ట్రీకి మరో హీరో

ఎసినీ ఇండస్ట్రీకి వారసుల రాక కొత్తేమి కాదు. ఇక ఇప్పుడు ఘట్టమనేని కుటుంబం నుంచి మరో యువ నటుడు తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టేందుకు రెడీ అయ్యాడు. సూపర్‌స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు, మహేష్ బాబు సోదరుడు రమేశ్‌బాబు కుమారుడు జయకృష్ణ త్వరలో హీరోగా తెరంగేట్రం చేయబోతున్నాడు. వైజయంతి ఆర్ట్స్, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ పై %=ః% 100, మంగళవరం లాంటి సూపర్ హిట్ సినిమాల డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ డెబ్యూ మూవీ తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమా కథ, ప్రాజెక్టు ని మహేష్ బాబు స్వయంగా పర్యవేక్షించారని టాలీవుడ్ టాక్. బాబాయ్ అండతో అబ్బాయి సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతుండగా, ఈ సినిమా పెద్ద విజయం సాధించడం ఖాయం అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్?గా సారా అర్జున్?ను అనుకుంటున్నట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం జయకృష్ణ ఫోటో షూట్ కూడా పూర్తైందని టాక్. ఈ భారీ లాంచ్‌కి రంగం సిద్ధం అవుతుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించనుండడంతో మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి. అజయ్ భూపతి %=ః% 100, మంగళవారం వంటి వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు జయకృష్ణ సినిమాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సినిమాని రూపొందించనున్నాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com